www.prajapaksham.in
ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్తంభాద్రి భద్రాద్రి
గురువారం | 29 | జనవరి | 2026 పేజీలు : 7

# తొలి రోజు 14 నామినేషన్లు



**ప్రజాపక్షం/ ఖమ్మం :** మున్సిపల్ ఎన్నికల్లో భాగంగా తొలి రోజున బుధవారం ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 14 నామినేషన్లు దాఖలయ్యాయి. ఖమ్మం జిల్లాలో ఐదు మున్సిపాలిటీలకు గాను ఏడు నామినేషన్లు దాఖలు కాగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెం కార్పోరేషన్‌తో పాటు రెండు మున్సిపాలిటీలలో ఏడు నామినేషన్లు దాఖలయ్యాయి. కొత్తగూడెం కార్పోరేషన్‌లో 56వ డివిజన్‌లో బిఆర్ఎస్ అభ్యర్థి బండారు రజిత, 19వ డివిజన్‌లో స్వతంత్ర అభ్యర్థిగా బోడా కృష్ణ, ఎనిమిదవ డివిజన్‌లో బిఆర్ఎస్ అభ్యర్థిగా కాంపల్లి సంధ్య నామినేషన్లు దాఖలు చేశారు. అశ్వారావుపేట మున్సిపాలిటీలో మూడవ వార్డు నుంచి బిఆర్ఎస్ అభ్యర్థిగా మిగతా 2లో..

# రాష్ట్రాభివృద్ధి, సంక్షేమమే మా లక్ష్యం



**-మంత్రుల భేటీపై అనవసర చర్చ**
**-మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్‌దే గెలుపు**
**-మీడియా సమావేశంలో డిప్యూటీ సిఎం మల్లు భట్టివిక్రమార్క**

**ప్రజాపక్షం/ఖమ్మం/మధిర :** రాష్ట్రాభివృద్ధి, సంక్షేమం లక్ష్యంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తుందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క తెలిపారు. ఒక ప్రత్యేక ప్రణాళికతో పాలన సాగుతుందని ఇచ్చిన హామీలను నెరవేర్చడంతో పాటు 2047 విజన్ డాక్యుమెంట్‌కు అనుగుణంగా కార్యక్రమాలు చేపడుతున్నామని ఆయన తెలిపారు. బుధవారం మధిరలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మల్లు భట్టివిక్రమార్క మాట్లాడుతూ మంత్రుల భేటీ గురించి కొందరు ఇష్టానుసారంగా రాస్తున్నారని ఉప ముఖ్యమంత్రినైనా నన్ను కలవకపోతే మిమ్మల్ని కలుస్తారా అని మంత్రుల భేటీపై రాసిన వారిని విక్రమార్క ప్రశ్నించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రాష్ట్రంలో లేనప్పుడు కొన్ని సూచనలు, సలహాలు మున్సిపల్ ఎన్నికల్లో గెలుపు తదితర అంశాలపై చర్చించేందుకు సమావేశం జరిగిందని అంతే తప్ప మరొకటి కాదని ఆయన స్పష్టం చేశారు.యావత్ రాష్ట్ర మంత్రి వర్గం ఐక్యంగా ఉందని ఒక కుటుంబంలా పనిచేస్తూ మిగతా 2లో..

## కూనంనేని సమక్షంలో
# పలు కుటుంబాలు సిపిఐలో చేరిక

**- భట్టు విజయను భారీ మెజార్టీతో గెలిపించాలి : కూనంనేని**



**ప్రజాపక్షం/కొత్తగూడెం :** కార్పోరేషన్ ఎన్నికల నగారా మోగడంతో నియోజకవర్గంలో రాజకీయ సమీకరణాలు శరవేగంగా మారుతున్నాయి. ఈ నేపథ్యంలో పాల్వంచ పట్టణ పరిధిలోని కరకవాగు 34వ డివిజన్‌కు చెందిన సుమారు 50 కుటుంబాల వారు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎంఎల్‌ఎ కూనంనేని సాంబశివరావు సమక్ష్యంలో ఆ పార్టీలో చేరారు. వీరందరికీ ఎంఎల్‌ఎ ఎర్ర కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. సిపిఐ నాయకులు జక్కా వెంకటేశ్వర్లు, బోడ భీమా నాయక్ సమన్వయంతో ఈ భారీ చేరికలు జరిగాయి. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ 34వ డివిజన్ నుండి సిపిఐ అభ్యర్థిగా బరిలో ఉన్న భట్టు విజయను అత్యధిక మెజార్టీతో గెలిపించుకోవాలని, ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడే ఎర్రజెండానే మనందరికీ అండగా ఉంటుందని నూతనంగా పార్టీలో చేరిన వారికి కూనంనేని దిశా నిర్దేశం చేశారు. పార్టీలో చేరిన వారిలో భట్టు విజయ, భట్టు హరి, అజ్మీరా భీమా, సీతారామ్, వీరన్న, మధు, కృష్ణ, ఫజిల్, సక్రి, నీలతో పాటు తదితరులున్నారు.

# లేబర్ కోడ్‌ల రద్దుకై పోరాడుదాం



**-ఫిబ్రవరి 12న జరిగే సభను జయప్రదం చేయండి**

2 లో


# కార్మిక హక్కులు కాలరాస్తున్న బిజెపి

**- ఫిబ్రవరి 12న జరిగే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేద్దాం**
**- జాతీయ కార్మిక సంఘాల జిల్లా సదస్సులో యూసఫ్**



2 లో

# కోయ జాతి సంస్కృతికి ప్రతీక ‘పడిగ’





**-మేడారం గద్దెలపై వంశ చరిత్రకు జీవం**
**-తరాల సాంప్రదాయాన్ని గుడ్డపై ఆవిష్కరిస్తున్న తోలెం వంశీయులు**
**-నైపుణ్యం ఉన్నా ఆదరణ కరువు**

**ప్రజాపక్షం/అశ్వాపురం:** కోయ జాతి సంస్కృతి, ఇలవేల్పుల ఆరాధన, వంశ చరిత్రకు ప్రతీకగా నిలిచిన పడిగ గిరిజనుల ఆత్మను ప్రతిబింబించే అరుదైన కళ, ఆసియా పండుగ మేడారం జాతర సందర్భంగా గద్దెలపై దర్శనమిచ్చే పడిగడాలు, గుడ్డలు కోయ సంస్కృతికి సజీవ సాక్ష్యాలుగా నిలుస్తున్నాయి. తరాలుగా వస్తున్న తోలెం వంశీయుల సంప్రదాయ నైపుణ్యంతో ఈ కళ నేటికీ కొనసాగుతున్నా, తగిన ఆదరణ లేక అంతరించిపోతుందేమో అన్న ఆందోళన కళాకారుల్లో నెలకొంది.

**పడిగ అంటే వస్త్రం కాదు...కోయ వంశ గాథ.....**

పడిగ కోయ జాతికి సాధారణ గుడ్డ కాదు. అది వారి వంశ చరిత్ర, కోయ తెగలలో సుమారు 170 ఇలవేల్పుల దేవుల్లు ఉంటారు. మిగతా 2లో..

# రాష్ట్రాభివృద్ధి, సంక్షేమమే మా లక్ష్యం

(మొదటిపేజీ తరువాయి)
ప్యూర్ క్యూర్ రేర్ సమగ్ర విధానంతో 2047 విజన్ డాక్యుమెంట్‌ను విడుదల చేశామని ఆయన తెలిపారు. మున్సిపల్ ఎన్నికల్లో పార్టీ బాధ్యులు ఐక్యంగా పనిచేసి అత్యుత్తమ ఫలితాలను సాధించాలన్నారు. నగరాలు, పట్టణాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట వేశామని తెలిపారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని సంక్షేమ పథకాలను తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో పొత్తుల అంశం పిసిసి అధ్యక్షుడు మాట్లాడతారని విక్రమార్క తెలిపారు. ఇచ్చిన హామీల్లో 90 శాతం అమలు చేశామని మరికొన్ని త్వరలో అమలు చేస్తామన్నారు. సింగరేణి టెండర్ల అంశంలో పూర్తి ఆధారాలతో స్పష్టత ఇచ్చానని ఆయన తెలిపారు. మున్సిపాలిటీ ఎన్నికలకు శాసన సభ్యులు, సీనియర్ నేతలు, ఆయా పట్టణాల బాధ్యులు సమిష్టిగా ఆలోచన చేసి కాంగ్రెస్ గెలిచేందుకు అన్ని చర్యలు చేపట్టాలని తెలిపారు. కాంగ్రెస్ భావజాలాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లగలిగే వారికే టికెట్లు కేటాయించాలని విక్రమార్క కోరారు. తెలంగాణ తలరాతను మార్చే విద్యపై తెలంగాణ ప్రభుత్వం దృష్టి సారించిందని ఆయన తెలిపారు. కాంగ్రెస్‌లో పోటీ చేసేందుకు ఎక్కువ మంది ఉత్సుకత చూపుతారని వీరంతా ప్రజాదరణ ఉన్న కాంగ్రెస్ ద్వారా సేవ చేయాలని కోరుకుంటున్న వారని ఆయన తెలిపారు. పోటీ పడటం తప్పు కాదని కాకపోతే అభ్యర్థుల ఎంపికలో సరైన నిర్ణయం తీసుకోవాలని స్థానిక నేతలకు ఆయన సూచించారు.

# కోయ జాతి సంస్కృతికి ప్రతీక ‘పడిగ’

(మొదటిపేజీ తరువాయి)
ఆ దేవతల కథలు, గిరిజనుల జీవన విధానం, అడవులతో అనుబంధం, వేట సంస్కృతి అన్ని రకాల కళాకృతలతో పడిగపై బొమ్మల రూపంలో కనిపిస్తాయి. మాటల్లో చెప్పలేని చరిత్రను గుడ్డపై చెప్పటం పడిగ ప్రత్యేకత.





### మేడారం జాతరలో పడిగకు అపూర్వ స్థానం...
ప్రపంచ ప్రసిద్ధి చెందిన మేడారం జాతర సందర్భంగా సమ్మక్క, సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజు దేవతలను తీసుకువచ్చే వేళ గద్దెలపై పడిగలను ప్రదర్శించడం కోయ తెగలలో శతాబ్దాలుగా వస్తున్న ఆచారం. పడిగ లేకుండా గద్దె సంపూర్ణం కాదన్న విశ్వాసం ఉంది. అందుకే మేడారం జాతరలో పడిగకు ప్రత్యేక ఆధ్యాత్మిక, సంస్కృతిక ప్రాముఖ్యత ఉంది.

### ఎలకలగూడెం నుంచే పడిగకు జీవ...
తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, ఛత్తీష్‌గడ్, ఒడిశా, మహారాష్ట్ర రాష్ట్రాల్లో కోయ తెగలు విస్తరించి ఉన్నప్పటికీ, పడిగను సంప్రదాయబద్ధంగా తయారు చేసే తోలెం వంశీయులు మాత్రం కేవలం తెలంగాణ రాష్ట్రంలోని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం మండలం మారుమూల గ్రామమైన ఎలకలగూడెంకే పరిమితం కావడం విశేషం. ఈ గ్రామానికి చెందిన నిరుపేద గిరిజన యువకులు తోలెం కళ్యాణ్, తోలెం వెంకటేశ్వర్లు తమ పూర్వీకుల వారసత్వాన్ని నిలబెడుతూ పడిగడాలు, గుడ్డలను రూపొందిస్తున్నారు. తరాల చరిత్రను నైపుణ్యంతో గుడ్డపై చూపెడుతూ, మేడారం జాతర ద్వారా కోయ సంస్కృతిని ఇతరులకు పరిచయం చేస్తున్నారు. అదే విధంగా గద్దెలపై వంశ చరిత్రను లెక్కించటంలో ఈ కళాకారులది కూడా ఒక ప్రత్యేక స్థానం ఉందని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ అధికారులు వీరి ద్వారా వారి కోయ సంస్కృతి తెగను తెలుసుకొని గద్దెలపై వంశ చరిత్రను చేశారంటే వీరికి ప్రత్యేకమైన స్థానం ఉందని చెప్పవచ్చు.

### శ్రమ అపారం...గుర్తింపు శూన్యం....
ఒక పడిగను రూపొందించడానికి రోజులు కాదు..వారాలు శ్రమ అవసరం. రంగుల ఎంపిక నుండి ప్రతి గీత వరకూ అనుభవమే ఆధారం. యంత్రాలకు చోటు లేని ఈ కళ పూర్తిగా చేతి నైపుణ్యంపై ఆధారపడింది. అయినా మార్కెట్ లేదు. స్థిర ఆదాయం లేదు. అందుకే ఈ సంప్రదాయం రాబోయే రోజుల్లో అంతరించినపోతుందేమో అన్న భయం ఈ కళాకారులను వెంటాడుతోంది.

### ప్రభుత్వ ప్రోత్సాహం అత్యవసరం....
కోయ జాతి సంస్కృతి ప్రతీక అయిన పడిగను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వపై ఉంది. ఐటిడిఏ పరిధిలో తోలెం వంశీయుల కళాకారులను గుర్తించి ప్రత్యేక ప్రోత్సాహం అందించాలి. చేనేత, హస్తకళా రంగంలో శిక్షణ, ఆర్థిక భరోసా, మార్కెటింగ్ అవకాశాలు కల్పించ్చలి. అదే విధంగా హైదరాబాద్‌లోని ప్రధాన ట్రైబల్ మ్యూజియంలో పడిగడాలు, గుడ్డలను శాశ్వతంగా ప్రదర్శించి, వాటి చరిత్రను వివరించే బాధ్యతను ఈ కళాకారులకే అప్పగించి ఉపాధి కల్పించాలని వారు కోరుతున్నారు.

### పడిగ నిలిస్తేనే కోయ చరిత్ర నిలుస్తుంది....
పడిగ ఒక కళ కాదు కోయ జాతి గుర్తింపు మేడారం జాతరలో ప్రపంచానికి పరిచయమైన ఈ సంప్రదాయం భవిష్యత్ తరాలకు చేరాలంటే ఇప్పుడే చర్యలు అవసరం. పడిగను కాపాడటం అంటే కోయుల వంశ చరిత్రను, సంస్కృతిని కాపాడటమే.

# కార్మిక హక్కులు కాలరాస్తున్న బిజెపి

**ప్రజాపక్షం/కొత్తగూడెం :** కేంద్రంలోని బిజేపి ప్రభుత్వం కార్మికులు పోరాడి సాధించుకున్న చట్టాలను కాలరాస్తోందని, ఇది 50 కోట్లమంది కార్మికుల హక్కులకు భంగం వాటిల్లే చర్యని ఏఐటియూసి రాష్ట్ర అధ్యక్షులు ఎండి యూసుఫ్ అన్నారు. బుధవారం కొత్తగూడెంలోని శేషగిరి భవన్ ఏఐటియూసి కార్యాలయంలో జరిగిన జాతీయ సంఘాలు ఏఐటియూసి, ఐఎన్‌టియూసి, సిఐటియు, ఇఫ్టు, టియుసిఐ, బిఆర్‌టియూ ఆధ్వర్యంలో జిల్లా సదస్సు జరిగింది. ఈ సదస్సుల్లో ఆయన మాట్లాడుతూ కార్మికులు ప్రాణాలు పణంగాపెట్టి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను అదానీ,అంబానీ లాంటి బడా కార్పోరేట్ కంపెనీలకు అనుకూలంగా ప్రధాని నరేంద్రమోడి వాటిని నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చారని, దేశంలో 50 కోట్ల మంది కార్మికులకు మేలు చేసే చట్టాలను తాకట్టుపెట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే బిజేపి ప్రభుత్వం లేబర్ కోడ్‌లను రద్దు చేసి పాత కార్మిక చట్టాలను కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఈ సదస్సులో ఏఐటియూసి జిల్లా ప్రధాన కార్యదర్శి నరాటి ప్రసాద్ మాట్లాడుతూ నరేంద్రమోడి ప్రభుత్వం దేశంలోని కార్మిక అనుకూల చట్టాలను నిర్వీర్యం చేసి వారి శ్రమను దోచుకుంటోందని మండిపడ్డారు. ఈ దేశంలో జీవించే కార్మికులు భారతీయులు కాదా అని ప్రశ్నించారు. కార్మికుల శ్రమను ఇతరులకు దోచిపెట్ట హక్కు ఎవ్వరికీ లేదని, మోడి ఇప్పటికైనా రద్దు చేసిన కార్మిక చట్టాలను అమల్లోకి తేవాలని డిమాండ్ చేశారు. రాజ్యాంగాన్ని రద్దు చేసే కుట్రలు మోడి సర్కారు చేస్తోందని, ఓవైపు కార్మిక చట్టాలు మార్పు, ఉపాధిహామీ చట్టం మార్పు, విద్యుత్, విత్తన సవరణ బిల్లులు, ఇన్సూరెన్స్ రంగంలో విదేశీ పెట్టుబడులు, రక్షణ రంగంలో ప్రైవేటు పెట్టుబడులు ఆహ్వానిస్తూ దేశాన్ని విదేశీయులు, బడాబాబుల చేతుల్లో పెట్టే




కుటిల ప్రయత్నాలు సాగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దేశ సహజ సంపదను సర్వనాశనం చేస్తూ దేశ సమగ్రతను విచ్ఛిన్నం చేయాలని మోడి ప్రభుత్వం చూస్తోందన్నారు. అనంతరం ఐఎన్‌టియూసి జిల్లా అధ్యక్షులు జలీల్, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఏజే రమేష్, టియుసిఐ జిల్లా అధ్యక్షులు మధుసూధన్ రెడ్డి, ఇఫ్టు జిల్లా ప్రధాన కార్యదర్శి జే సీతారామయ్య, సురేందర్, బిఆర్‌టియూ జిల్లా అధ్యక్షులు మాట్లాడుతూ కార్మిక సోదరులు రానున్న రోజుల్లో ప్రభుత్వ ఉద్యోగాలు, పెన్షన్లు బంద్, రిటైర్డ్‌మెంట్ బెనిఫిట్స్ బంద్, సంక్షేమ పథకాలు బంద్, విద్యావైద్యాన్ని కూడా ఈ బిజేపి ప్రభుత్వం బంద్ పెట్టే ప్రమాదం ఉందని, దేశయువతను బిచ్చగాళ్లుగా మార్చే పనిలో మోడి సర్కారు పని చేస్తోందని మండిపడ్డారు. దేశసమగ్రత, సమైక్య, సంక్షేమ చట్టాలను కాపాడుకునేందుకు కార్మిక లోకం అంతా ఏకతాటిపైకి రావాలని పిలుపునిచ్చారు. ఫిబ్రవర్ 12న సమ్మెలో కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రథం చేయాలని కోరారు. ఈ సమావేశంలో కార్మిక సంఘాల నాయకులు నాగభూషణం, గెద్దాడు నగేష్, గోనె మణి, వంగ వెంటక్, కందుల భాస్కర్, ఎండూరి ప్రభావతి, కే బ్రహ్మాచారి, భూక్యా రమేష, జి పద్మ, నూపా భాస్కర్, సంజీవ్, డి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# తొలి రోజు 14 నామినేషన్లు

(మొదటిపేజీ తరువాయి)
ఉపాధ్యాయుల సూర్యప్రకాష్‌రావు, 22వ డివిజన్ నుండి బిజెపి అభ్యర్థి నార్ల వీరాంజనేయులు, మూడవ వార్డు నుండి బిజెపి అభ్యర్థిగా ఆంజనేయులు నామినేషన్ దాఖలు చేశారు. ఖమ్మం జిల్లా ఏదులాపురం మున్సిపాలిటీలో 23వ వార్డు నుండి కాంగ్రెస్ అభ్యర్థిగా అనిత, 24వ వార్డు నుంచి సిపిఎం అభ్యర్థిగా హైమావతి నామినేషన్లు దాఖలు చేశారు. వైరాలో రెండు నామినేషన్లు దాఖలు కాగా సత్తుపల్లిలో మూడు నామినేషన్లు దాఖలయ్యాయి. మధిర, కల్లూరు మున్సిపాలిటీలలో ఒక నామినేషన్ కూడా దాఖలు కాలేదు.

**కొనసాగుతున్న పొత్తుల చర్చలు :**
వివిధ రాజకీయ పక్షాల మధ్య పొత్తుల విషయమై చర్చలు సాగుతున్నాయి. ఒక్కో మున్సిపాలిటీకి ఒక్కో రీతిలో చర్చలు కొనసాగుతున్నాయి. నామినేషన్ల ఘట్టానికి సంబంధించి తొలి రోజు పూర్తయిన చర్చలు కొలిక్కి రాలేదు. మధిర, ఏదులాపురం మున్సిపాలిటీలలో బిఆర్ఎస్, సిపిఎం ల మధ్య ఒప్పందం కుదిరినట్లు సమాచారం.

# లేబర్ కోడ్‌ల రద్దుకై పోరాడుదాం

**ప్రజాపక్షం/ఖమ్మం :** కేంద్ర ప్రభుత్వం తీసుకు వచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లు రద్దు చేసేంత వరకు పోరాటం కొనసాగించాలని కార్మిక సంఘాల సంయుక్త సమావేశం పిలుపునిచ్చింది. ఫిబ్రవరి 12న జరగనున్న సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని కార్మిక సంఘాల నేతలు పిలుపునిచ్చారు. ఫిబ్రవరి 12న జరిగే సార్వత్రిక సమ్మె జయప్రదం కోరుతూ ఖమ్మంలోని మంచికంటి భవన్‌లో వివిధ కార్మిక సంఘాల సంయుక్త సమావేశం బుధవారం జరిగింది. ఈ సమావేశంలో ఏఐటియుసి, సిఐటియు, ఐఎన్‌టియుసి, టియుసిఐ, బిఆర్‌టియు సంఘాలు పాల్గొన్నాయి. సంయుక్త సమావేశంలో కార్మిక సంఘాల నేతలు మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం కార్మిక సంఘాలు కార్మిచ చట్టాలు లేని దేశంగా భారతదేశాన్ని మార్చాలని చూస్తుందని ఆరోపించారు. పారిశ్రామిక వేత్తల కోసం కార్పొరేట్ల కోసం బిజెపి ప్రభుత్వం పనిచేస్తుందని ఆరోపించారు. అనేక దశాబ్దాల పాటు పోరాటాలు సాగించి ఎందరో కార్మికుల త్యాగాలతో సాధించుకున్న 29 కార్మిక చట్టాలను బిజెపి ప్రభుత్వం రద్దు చేసిందన్నారు. వాటి స్థానంలో నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకు వచ్చిందని కార్మికుల పోరాట ఫలితంగా ప్రస్తుతానికి లేబర్ కోడ్‌ల అమలు ఆగిన తిరిగి ప్రభుత్వం అమలు చేసేందుకు పూనుకుందని వారు తెలిపారు. దీనికి సంబంధించి గడిచిన నవంబర్‌లో నోటిఫికేషన్ జారీ చేసిందని కార్మిక సంఘాల నాయకులు తెలిపారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని రద్దు చేసి దాని స్థానంలో విబిజి రామ్‌జీ పథకాన్ని తీసుకు వచ్చిందని దీని వల్ల గ్రామీణ పేదలు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. వెంటనే ఈ పథకాన్ని ఉపసంహరించుకుని గతం మాదిరి రాష్ట్రాలపై భారం వేయకుండా జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని అమలు చేయాలని కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. లేబర్ కోడ్‌ల కారణంగా 40 కోట్ల మంది సంఘటిత అసంఘటిత రంగ కార్మికులు ఇబ్బందులు పడే అవకాశం ఉందన్నారు. కార్మిక చట్టాలను మోడీ సర్కార్ నియంతృత్వ పద్ధతుల్లో రద్దు చేశారని అంతర్జాతీయ కార్మిక సంస్థ సూచనలను కూడా పట్టించుకోలేదని కార్మిక సంఘాల నాయకులు తెలిపారు. యూనియన్ల ఏర్పాటుకు సంబంధించి స్వాతంత్ర్యం రాక పూర్వమే కార్మికులు హక్కుగా సాధించారని ఇప్పుడు కార్మిక సంఘాన్ని ఏర్పాటు చేసే హక్కు కానీ, పోరాడే హక్కును లేకుండా చేయాలని చూస్తుందన్నారు. ఈ సమావేశంలో ఏఐటియుసి రాష్ట్ర కార్యదర్శి శింగు నర్సింహారావు, సిఐటియు నాయకులు కళ్యాణం వెంకటేశ్వరరావు, టియుసిఐ నాయకులు సూర్యం, ఐఎన్‌టియుసి నాయకులు పాషా, బిఆర్‌టియు నాయకులు జనార్ధన్ తదితరులు ప్రసంగించగా ఈ కార్యక్రమంలో ఏఐటియుసి జిల్లా కార్యదర్శి తోట రామాంజనేయులు, టియుసిఐ జిల్లా కార్యదర్శి జి. రామయ్య, ఐఎఫ్‌టియు జిల్లా నాయకులు సుభాన్, వివిధ కార్మిక సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# పల్లెల్లో పైసల గోల..!

### 15వ ఆర్థిక సంఘం నిధులపై పంచాయతీల్లో వివాదం
### పాత బిల్లులు చెల్లించాలని మాజీ సర్పంచులు డిమాండ్
### అభివృద్ధి పనులకు వినియోగిస్తామంటున్న నూతన సర్పంచులు....

**ప్రజాపక్షం/కల్లూరు:** కల్లూరు మండల పరిధిలోని 23 గ్రామపంచాయతీలలో డిసెంబర్ నెలలో ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికలలో భాగంగా నూతన సర్పంచ్‌లు బాధ్యతలు చేపట్టగా జనవరి నెలలో 15వ ఆర్థిక సంఘం నిధులు ఆయా గ్రామ పంచాయతీలకు నిధులు మంజూరు అయ్యాయి. ఈ విషయాన్ని తెలుసుకున్న మాజీ సర్పంచులు గ్రామాభివృద్ధికి దాతలు, కార్యదర్శులు గ్రామపంచాయతీలు నిర్వహణకు వీధిలైట్లు పారిశుద్ధ్యం ట్రాక్టర్ నిర్వహణ తదితర పనులకు సుమారుగా రెండు సంవత్సరాలకు 3 లక్షలకు పైగా బకాయిలు కాగా గత సర్పంచులకు రావాల్సిన బకాయిలు ప్రస్తుతం చెల్లించాలని ఆయా గ్రామాలలో సర్పంచులను పాలకవర్గమును కార్యదర్శులను డిమాండ్ చేస్తున్నారు. ఈ విషయమై గ్రామాల్లో మాజీ, ప్రస్తుత సర్పంచులకు వివాదాలు నడుస్తున్నాయి. కేంద్రం నిధులు విడుదల చేయడం విషయాన్ని తెలుసుకున్న మాజీ సర్పంచులు గ్రామాభివృద్ధికి పెట్టుబడి పెట్టిన దాతలు సర్పంచులు గృహాలు చుట్టూ పాలకవర్గం చుట్టూ తిరుగుతున్నారు. ఆనాడు ఉన్నటువంటి బకాయిలు ప్రస్తుతం ఉన్న కార్యదర్శులు కు పూర్తి వివరాలు తెలుసుకొని మా పెట్టుబడులు మా బకాయిలు మొత్తం ఇవ్వాల్సిందేనని పట్టుబడుతూ గ్రామాల్లో చర్చలు కొనసాగుతున్నవి. మరికొన్ని గ్రామాలలో గ్రామ కార్యదర్శులు తమ వేతనాల నుంచి అధిక మొత్తంలో ఖర్చు పెట్టామని ఆ బకాయిలు కూడా ఇవ్వాలని పాలకవర్గాన్ని పట్టుబడుతున్నారు. కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన నిధులు నిబంధనలను ప్రకారం మాత్రమే ఖర్చు చేయాలని ఆదేశాలు ఉండటంతో కార్యదర్శులు పాలకవర్గం తర్జనమర్జనం పడుతున్నారు. ఈ విషయమై ఎంపీడీవోను చంద్రశేఖర్ ను వివరణ కోరగా పాలకవర్గం అనుమతి తీర్మానం మేరకే నిధులు వినియోగం డ్రా చేయడం జరుగుతుందని ఎంపీడీవో పేర్కొన్నారు.

# నేడు సామాజిక తనిఖీ

**ప్రజాపక్షం/కల్లూరు:** కల్లూరు మండలం లోని 17వ సామాజిక తనిఖీ ప్రజావేదిక గురువారం ఉదయం నుండి కొర్లగూడెం రైతు వేదిక నందు జరుగుతుందని ఎంపీడీవో చంద్రశేఖర్, ఈజిఎస్ ఏపీవో హేమమాలి ని లు తెలిపారు. గత సంవత్సరం జరిగిన ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీ వేదిక కార్యక్రమం జరుగుతుందని ఈ కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులు ఎస్ఆర్పీలు, డిఆర్పిలు, జిల్లాస్థాయి అధికారులు పాల్గొంటున్నట్లు ఎంపీడీవో, ఏపీవోలు తెలిపారు.

# బోధనలో సాంకేతికతను జోడించండి

**-జిల్లా విద్యాశాఖాధికారిణి చైతన్యజైని**

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** బోధనలో సాంకేతికతను జోడించి విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని జిల్లా విద్యాశాఖాధికారిణి చైతన్యజైని తెలిపారు. పిఎంశ్రీ పాఠశాలలో పనిచేసే ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు ఐసిటి అంశాలపై రెండు రోజులు శిక్షణా తరగతులు బుధవారం జిల్లా విద్య శిక్షణా సంస్థ ఆధ్వర్యంలో సోషల్ వెల్ఫేర్ గురుకుల పాఠశాలలో ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి కో డైరెక్టర్‌గా వ్యవహరిస్తున్న జిల్లా విద్యాశాఖాధికారిణి చైతన్య జైని ముఖ్య అతిథిగా హాజరై శిక్షణను ప్రారంభించి మాట్లాడారు. కంటెంట్, పెడగాజీ, అసెస్మెంట్, కమ్యూనికేషన్ అంశాల్లో ఐసిటి వినియోగాన్ని పెంచడం ద్వారా విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తూ మెరుగైన అభ్యాసన ఫలితాలు సాధించవచ్చునని ఉపాధ్యాయులకు సూచించారు. శిక్షణలో గూగుల్ అంశాలైన గూగుల్ ఫామ్స్, గూగుల్ షీట్లు, గూగుల్ డాక్యుమెంట్లు, గూగుల్ స్లైడ్‌లను ఎలా రూపొందించాలి, ఎలా వినియోగించుకోవాలి, వాటి అవసరం ఏమిటి, విద్యార్థులకు మెరుగైన బోధన, అభ్యాసన ప్రక్రియలను ఏవిధంగా జరపవచ్చో తదితర అంశాలపై ఇంటరాక్టివ్‌గా వ్యవహరిస్తూ ఉపాధ్యాయులతో సాధన చేయించడం జరుగుతుందన్నారు. కోర్స్ కో ఆర్డినేటర్ ఎవిఎంపెసర ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ ఖమ్మంజిల్లాలో 28 పిఎంశ్రీ పాఠశాలల్లోని 508 మంది ఉపాధ్యాయులకు రెండు విడతలుగా సాంకేతిక వినియోగం, ఐసిటి అంశాలపై శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు.



పిఎంశ్రీ పాఠశాలలుగా ఎంపికైన ఉన్నత పాఠశాలల్లో సాంకేతిక వినియోగం విస్తృతంగా పెరిగిందని ఈ నేపథ్యంలో ప్రతి పాఠశాలకు ఒక ల్యాప్‌టాప్, ఉపాధ్యాయులకు ట్యాబ్‌లు అందజేశామన్నారు. ఈ శిక్షణ చాలా ఉపయోగకరంగా ఉందని కూసుమంచి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన సరస్వతి తెలిపారు. కరోనా ముందు ఆ తర్వాత జరిగిన మార్పుల నేపథ్యంలో విద్యా బోధనలో సాంకేతిక వినియోగం చాలా పెరిగిందన్నారు. గూగుల్ పామ్ షీట్లు, డాక్యుమెంట్లను పంపిస్తే వాటిని నింపడం వరకే చేస్తున్నామని కానీ వాటిని ఎలా తయారు చేసుకోవాలి, ఎలా వినియోగించుకోవాలి, వాటి వల్ల విద్యార్థులకు ఏమి ఉపయోగం జరుగుతుందో ఈ శిక్షణలో తెలుసుకున్నామన్నారు. ఈ శిక్షణ వల్ల విద్యార్థులకు మేలు కలుగుతుందని తెలిపారు.

# ముని్సపాలిటీ ఎన్నికల్లో కాంగ్రెస్ సత్తా చాటాలి

**-జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్**

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** మున్సిపాలిటీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ సత్తా చాటాలని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ తెలిపారు. బుధవారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయం సంజీవరెడ్డి భవన్‌లో ముఖ్య నాయకులతో మున్సిపాలిటీ ఎన్నికలకు సంబంధించి సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు సత్యనారాయణ గౌడ్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఛైర్మన్ రాయల నాగేశ్వరరావు లు మాట్లాడుతూ జిల్లాలో గతంలో మూడు మున్సిపాలిటీలు ఉన్నాయని ఇప్పుడు ఐదు మున్సిపాలిటీలు ఏర్పడ్డాయన్నారు. అన్ని మున్సిపాలిటీల్లో కాంగ్రెస్ జెండా ఎగురవేయాలన్నారు. ఎన్నికలు జరగనున్న అన్ని మున్సిపాలిటీల్లో నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ఓటర్లకు వివరించాలన్నారు. గెలుపే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పనిచేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంఎల్‌ఏ కొండబాల కోటేశ్వరరావు, మాజీ ఎంఎల్‌సి పోట్ల నాగేశ్వర



రావు,కాంగ్రెస్ జిల్లా మాజీ అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, ఓబిసి సెల్ ఉపాధ్యక్షులు వడ్డెబోయిన నర్సింహారావు, రాష్ట్ర కాంగ్రెస్ మహిళా నాయకురాలు పగడాల మంజుల, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు యర్రం బాలగంగాధర్ తిలక్, జిల్లా మహిళా అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య, సయ్యద్ గౌస్, బొడ్డు బొందయ్య, ముఖ్య నాయకులు, డివిజన్ అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

# సిపిఐ (ఎంఎల్) మాస్‌లైన్ ఆధ్వర్యంలో నిరసన

**ప్రజాపక్షం/ అశ్వారావుపేట :** కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా, కార్మిక వ్యతిరేక పోకడలను నిరసిస్తూ సిపిఐఎంఎల్ మాస్‌లైన్ ఆధ్వర్యంలో బుధవారం నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. అశ్వారావుపేట బస్టాండ్ వద్ద జరిగిన కార్యక్రమానుద్దేశించి ఆ సంఘం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు గోకినపల్లి ప్రభాకర్ మాట్లాడుతూ మోడీ నాయకత్వంలోని బిజెపి ప్రభుత్వం అనేక ప్రజా వ్యతిరేక పోకడలు అమలు చేస్తోందని, అందులో భాగంగానే ఉపాధి హామీ చట్టాన్ని రద్దు చేసే కుట్రలలో భాగంగా విబిజి రాంజీ అనే పేరుతో కొత్త చట్టానికి రూపకల్పన చేసిందన్నారు. దీని వలన ఉపాధికార్మికులు ప్రధానంగా మహిళలు ఉపాధి కోల్పోయే ప్రమాదం ఉంద




న్నారు. అలాగే అనేక దశాబ్దాలుగా భారత కార్మిక వర్గం పోరాటాలు నిర్వహించి సాధించుకున్న కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు కోడ్స్‌గా విభజించి కార్మిక హక్కుల మీద కేంద్ర ప్రభుత్వం తీవ్రమైన దాడిని కొనసాగిస్తుందని, దీనికి వ్యతిరేకంగా కార్మిక వర్గం పెద్ద ఎత్తున ఉద్యమించాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ ఎంఎల్ మాస్‌లైన్ మండల కమిటీ నాయకులు కంగారా వెంకటేశ్వరరావు, కావడిగుండ్ల గ్రామ సర్పంచ్ బాడిశ లక్ష్మణరావు, మాజీ సర్పంచ్ కె.భూలక్ష్మి, మడకం మందారావ్, గంగాల శంకర్, మడివి రమేష్, నాగులు, కుమార్‌స్వామి, జుజ్జూరు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ప్రారంభమైన సిఎం కప్ ఆటల పోటీలు

**ప్రజాపక్షం/ఎర్రుపాలెం :** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సిఎం కప్ ఆటల పోటీలు బుధవారం ఎర్రుపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఈ క్రీడలను ఎంపిడిఓ సురేందర్ ప్రారంభించారు. ఈ క్రీడలకు ముఖ్య అతిథిగా పాల్గొన్న మధిర మార్కెట్ కమిటీ చైర్మన్ బండారు నర్సింహారావు మాట్లాడుతూ క్రీడలు విద్యార్థుల మానసిక శారీరక శక్తిని పెంపొందిస్తాయని విద్యార్థులకు విద్యతో పాటు క్రీడలు చాలా ముఖ్యమని క్రీడల ద్వారానే విద్యార్థుల్లో ఉన్న ప్రతిభ వెలికి తీయవచ్చునని పేర్కొన్నారు. సీనియర్ వ్యాయామ ఉపాధ్యాయులు మారబత్తుల జమలయ్య మాట్లాడుతూ ఎర్రుపాలెం మండలంలో ఏడు క్లస్టర్ నుంచి సుమారు 300 మంది క్రీడాకారులు పాల్గొన్నారని తెలిపారు. ఈ క్రీడల్లో విజయం సాధించిన క్రీడాకారులు నియోజవర్గ స్థాయిలో జరిగే సిఎం కప్ క్రీడల్లో పాల్గొంటారని తెలిపారు. క్రీడాకారులకు ఉచిత భోజన వసతి సౌకర్యం కల్పించారు. కబడ్డీ, ఖోఖో విభాగాల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందచేశారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు



వేమిరెడ్డి సుధాకర్‌రెడ్డి, తహశీల్దార్ ఉషాశారద, ఎంఈఓ మురళీమోహన్, ఎర్రుపాలెం సర్పంచ్ నంద్రు అశ్విని, సీనియర్ కాంగ్రెస్ నాయకులు అయిలూరి వెంకటేశ్వర్‌రెడ్డి, బొగ్గుల గోవర్ధన్‌రెడ్డి, టౌన్ కాంగ్రెస్ అధ్యక్షులు షేక్.ఇస్మాయిల్, ఉపసర్పంచ్ షేక్.శభాషి, మీనవోలు సర్పంచ్ కోట కన్నమ్మ, ఇనగాలి స్పంచ్ అనసూయమ్మ, నాగిరెడ్డి, కత్తి రవి తదితరులు పాల్గొన్నారు.

# సిపిఐ సానుభూతిపరుడు మృతి

**- నివాళులర్పించిన సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్**

**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని వరంగల్ క్రాస్‌రోడ్ లోని 29వ డివిజన్‌కు చెందిన సిపిఐ సానుభూతి పరుడు కామళ్ల లక్ష్మయ్య(80) అనారోగ్యంతో బుధవారం ఇంటి వద్ద మృతి చెందాడు. విషయం తెలుసుకున్న సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని వ్యక్త పరిచారు. మృతుడికి భార్య, ముగ్గురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.



# తొలిరోజు రెండు నామినేషన్లు దాఖలు

**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ఏదులాపురంమున్సిపాలిటీ ఎన్నికల నేపథ్యంలో తొలిరోజు మంగళవారం రెండు నామినేషన్లు దాఖలయ్యాయి. 23వ డివిజన్ నుంచి కాంగ్రెస్ అభ్యర్థిని పోకబత్తిని అనిత, 31వ డివిజన్ నుంచి ఊరడి హైమావతి నామినేషన్ పత్రాలను ఎన్నికల అధికారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో 23వ డివిజన్ ఇంఛార్జ్ శ్రీనివాస్‌రెడ్డి, స్థానిక కాంగ్రెస్ నాయకులు తోటచిన్న వెంకట్‌రెడ్డి, సిపిఎం మండల కార్యదర్శి ఊరడిసుదర్శన్‌రెడ్డి పాల్గొన్నారు.



# నేను ఇండిపెండెంట్ సర్పంచ్‌నే..

**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** పడమటితండా ప్రజల ఆశీర్వాదంతో నేను ఇండిపెండెంట్ అభ్యర్థిగా పోటీచేసి సర్పంచ్‌గా గెలిచానని బోడా భీమా అన్నారు. ఈ మేరకు ఏదులాపురంమున్సిపాలిటీపరిధిలోని వరంగల్‌క్రాస్‌రోడ్29వ డివిజన్‌లోని వినోద్ ఆన్‌లైన్‌సర్వీసెస్‌లో విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...నా రక్తంలోనే కాంగ్రెస్ ఉందని, కానీ సర్పంచ్‌గా తనకు సీటు ఇవ్వకపోవడంతో ఇండిపెండెంట్‌గా పోటీ చేసి గెలిచానన్నారు. కానీ కొన్ని పార్టీలు తనను మా సర్పంచ్ అంటూ ప్రచారం చేసుకుంటున్నాయని అది సరైనది కాదన్నారు. నాపై నమ్మకం ఉంచి నన్ను గెలిపించిన ఊరి అభివృద్ధి కోసం మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సహకారం తీసుకుంటున్నారు. కానీ తను మాత్రం ప్రజలిచ్చిన ఇండిపెండెంట్ సర్పంచ్‌గానే కొనసాగుతన్నారు.



# నేత్రదానం శ్రేష్టమైన దానం

**ప్రజాపక్షం/బోనకల్ :** నేత్రదానం శ్రేష్టమైన దానం అని ఖమ్మం నేత్ర నిధి టెక్నీషియన్ మందా నాగేశ్వరరావు తెలిపారు. బోనకల్ మండలం చొప్పకట్లపాలెం గ్రామానికి చెందిన పల్లా రామకోటయ్య(93) మంగళవారం రాత్రి మృతి చెందారు. కుటుంబసభ్యులు ఆయన కళ్లు ఖమ్మం నేత్ర నిధికి దానం చేశారు. బుధవారం ఉదయం నేత్రదానం అనంతరం నాగేశ్వరరావు మాట్లాడుతూ నేత్రదానం వల్ల కార్నియా సమస్య ఉన్న 15 నుండి 20 సంవత్సరాలు వయస్సు ఉన్న ఇద్దరికి చూపు తెప్పించడానికి ఉపయోగపడుతుందన్నారు. చొప్పకట్లపాలెంలో ఇప్పటికి 20కిపైగా నేత్ర దానం చేసి జిల్లాలో ప్రథమ స్థానంలో నిలిచిందన్నారు. ఈ కార్యక్రమంలో పల్లా ప్రపంచ ఫౌండేషన్ అధ్యక్షులు పల్లా కొండలరావు, కుటుంబసభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల అల్పాహారానికి రూ.10వేలు వితరణ

**ప్రజాపక్షం/ఎర్రుపాలెం :** మండల పరిధిలోని మీనవోలు ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు అల్పాహారానికి గ్రామ బిఆర్‌ఎస్ పార్టీ యూత్ నాయకులు రూ.10వేలు బిఆర్‌ఎస్ పార్టీ మండల కార్యదర్శి ఎం.శ్రీనివాస్ రెడ్డి, మాజీ ఎంపిటిసి కుడుముల మల్లికార్జున్‌రెడ్డిచే ఏతుల మీదుగా విద్యార్థులకు ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు మంచి మార్కులతో పాస్ అవ్వాలని ఆకాంక్షించారు. ఈక ఆర్యక్రమంలో వార్డు మెంబర్ అఖిల్, కుడుముల వెంకట్‌రెడ్డి, నాగుల్ మీరా, సోమశేఖర్‌రెడ్డి, వెంకటరమణారెడ్డి, గ్రామ పెద్దలు, కొండూరు నాగేశ్వరరావు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.



# ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

**ప్రజాపక్షం/ ఎర్రుపాలెం :** మనస్తాపానికి గురై ఉరివేసుకుని ఒక వ్యక్తి మృతి చెందిన సంఘటన మండల కేంద్రం ఎర్రుపాలెంలో జరిగింది. స్థానిక ఎస్సై తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండల కేంద్రమైన ఎర్రుపాలెం గ్రామానికి చెందిన సిపిఎం పార్టీ సానుభూతిపరుడు రేఖ దుర్గయ్య (60) లారీ డ్రైవర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. గత నాలుగు సంవత్సరాల నుండి భార్యతో గొడవపడి ఎర్రుపాలెంలోని మరో ఇంట్లో కిరాయికి ఉంటూ జీవిస్తున్నాడని, ఈ క్రమంలో బాగా మద్యానికి బానిసై మతిస్థిమితం లేకుండా తిరుగుతూ తన కుటుంబానికి దూరంగా ఉంటున్నాడు. మనస్తాపంతో జీవితంపై విరక్తి చెంది మంగళవారం రాత్రి ఎర్రుపాలెంలోని కస్తూరిబాగాంధీ స్కూల్‌కి ఎదురుగా ఉన్న మిషన్ భగీరథ వాటర్ ట్యాంక్‌గల మెట్లకు వైరుతో ఉరి పెట్టుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. బుధవారం ఉదయం అటుగా వచ్చిన మృతుని కుమారుడు గోపి వెంటనే స్థానిక పోలీసులకు సమాచారం ఇచ్చాడు. దీంతో స్థానిక ఎస్సై ఎం.రమేష్‌కుమార్ అక్కడికి చేరుకుని పంచనామా నిర్వహించి మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం మధిర ప్రభుత్వాసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు



## సిఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** తెలంగాణలో అన్ని వర్గాల సంక్షేమమే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతున్నట్లు జిల్లా కాంగ్రెస్ నాయకులు కొడాలి గోవిందరావు పేర్కొన్నారు. మండల కేంద్రంలో పార్టీ కార్యాలయంలో బుధవారం లబ్దిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రభుత్వం ప్రతీ పేద వాడికి సంపూర్ణ ఆరోగ్యం అందించాలనే లక్ష్యంతో ఉన్నట్లు తెలిపారు. అభాగ్యుల పట్ల సీఎంఆర్ఎఫ్ అండగా ఉంటుందని అన్నారు. అనేక మంది నిరుపేదలకు వైద్యం కోసం ఖర్చు చేస్తుందని అన్నారు. మండలం లో 96 మంది లబ్దిదారులకు రూ.36.77,500 విలువైన చెక్కులను అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ వెన్నపూసల సీతారాములు, భద్రయ్య, మామిడి వెంకన్న, రాయపూడినవీన్, నల్లాని మల్లికార్జున్, జెర్రిపోతుల అంజిని, నంబూరి రామారావు, బైరు లక్ష్మినారాయణ, బచ్చలకూరి నాగరాజు, పసుపులేటి శ్రీలత, గరిడేపల్లి రామారావు, కడియాల నరేష్, ఆయా పంచాయతీ సర్పంచ్ లు, ఉప సర్పంచ్ లు తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించండి

**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ఏదులాపురం మున్సిపాలిటీ ఎన్నికలలో పోటీ చేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని, కాంగ్రెస్ జిల్లా యువజన నాయకుడు తమ్మినేని నవీన్ ప్రజలకు పిలుపునిచ్చారు. మంగళవారం మున్సిపాలిటీపరిధిలోని తెల్దారుపల్లిలో 14,15,16వార్డుల గెలుపు వ్యూహాలపై సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి దక్షతతో తెల్దారుపల్లిలోని వార్డులలో అభివృద్ది పరుగులు పెడుతుందన్నారు. అనేక సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న సమస్యలకు కోట్ల రూపాయల నిధులను వెచ్చించి, మోక్షం కలిగించారన్నారు. మున్ముందు కూడా అభివృద్ధికి చిరునామ తెల్దారుపల్లిగా రూపాంతరం చెందబోతుందన్నారు. కావున ప్రజలు హస్తం గుర్తుపై ఓటు వేసి కాంగ్రెస్ అభ్యర్థులను ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జిలు జొన్నలగడ్డ రవి, కృష్ణగౌడ్, కాంగ్రెస్ నాయకులు, కృష్ణయ్య అభిమానులు పాల్గొన్నారు.

## టిఎస్ యుటిఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరణ



**ప్రజాపక్షం/ బోనకల్ :** టిఎస్ యుటిఎఫ్ పాకెట్ క్యాలెండర్‌ను బోనకల్ మండల విద్యాశాఖ అధికారి దామాల పుల్లయ్య బుధవారం మండల కేంద్రంలో ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పాకెట్ క్యాలెండర్లో ఈసిఆర్‌కు ప్రాధాన్యత ఇవ్వడం సంతోషదాయకమని, సర్వీస్ వివరాలకు సంబంధించిన అంశాలను క్రోడికరించడం అభినందనీయమని ఉపాధ్యాయులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బోనకల్ మండల కాంప్లెక్స్ హెచ్‌ఎం ఎ.గోపిచంద్, టిఎస్‌యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి గుగులోతు రామకృష్ణ, మండల అధ్యక్షులు చిన్న రంగారావు, మండల ఉపాధ్యక్షులు పి.గోపాలరావు, మండల కోశాధికారి పి.నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.

## అణగారిన వర్గాల కోసమే తెలంగాణ రాజ్యాధికార పార్టీ




**ప్రజాపక్షం/పాల్వంచ :** అణగారిన వర్గాల అభ్యున్నతికి తెలంగాణ రాజ్యాధికార పార్టీ పాటుపడుతుందని ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు మల్లెల వీరనారాయణ అన్నారు. పాల్వంచ ప్రెస్‌క్లబ్‌లో బుధవారం పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా జరిగే మున్సిపల్, కార్పోరేషన్ ఎన్నికలలో పోటీ చేయనున్నామని అన్నారు.బిసి, ఎస్‌సి, ఎస్‌టి, మైనారిటీలను అధికారంలోకి తీసుకొని రావటమే పార్టీ ఉద్దేశ్యమన్నారు. వారి హక్కుల కోసమే పుట్టింది తెలంగాణ రాజ్యాధికార పార్టీ అని తెలిపారు. అధికారం, ఆత్మగౌరవం మా వాటా, ఎవరికెంతో వారికంతా ఇదే మా నినాదమన్నారు. ఈ సమావేశంలో జిల్లా కార్యవర్గ సభ్యులు, మండల అధ్యక్ష, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ ఎన్నికలు సజావుగా నిర్వహించాలి

**ప్రజాపక్షం/ కొత్తగూడెం :** జిల్లాలో జరగనున్న మున్సిపల్ కార్పోరేషన్ ఎన్నికలు సజావుగా, పారదర్శంగా, శాంతియుత వాతావరణంలో నిర్వహించడంలో జోనల్ అధికారులు కీలక పాత్ర పోషించాలని జిల్లా అదనపు కలెక్టర్ విద్యాచందన తెలిపారు. స్థానిక ఐడిఒసిలో నిర్వహించిన అకౌంటింగ్ టీమ్‌ల శిక్షణా కార్యక్రమానికి హాజరైన ఆమె మాట్లాడారు. ప్రతీ జోనల్ అధికారులు ఎన్నికల నిర్వహణపై నేరుగా పర్యవేక్షణ చేపట్టాలన్నారు. పోలింగ్ కేంద్రాల స్థితిగతులు, ఎన్నికల సిబ్బంది నియామకం, ఓటర్లకు అవసరమైన మౌళిక సదుపాయాల కల్పన వంటి అంశాల్లో ప్రత్యేక శ్రద్ద తీసుకోవాలన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి కఠినంగా అమలు చేయాలని, ఎలాంటి ఉల్లంఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సమస్యాత్మక ప్రాంతాలను ముందుగానే గుర్తించి చర్యలు తీసుకోవాలని, శాంతి భద్రతలకు ఎలాంటి విఘాతం వాటిల్లకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం విధులు, బాధ్యతలపై వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయితీ అధికారి సుదీర్, రాజశేఖర్, ఎంపిడిఓలు, శ్రీనివాస్, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

# పనులు శరవేగంగా పూర్తి చేయాలి

**-మెరుగైన వైద్య సేవలు అందించండి**
**-జిల్లా అదనపు కలెక్టర్ పి.శ్రీజ**





**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** ఆసుపత్రి అభివృద్ధి పనులను శరవేగంగా పూర్తి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ డాక్టర్.పి.శ్రీజ ఆదేశించారు. మండల కేంద్రం లోని సామాజిక ఆరోగ్య కేంద్రం, చెరువుమాధారం లోని ప్రాధమిక ఆరోగ్య కేంద్రాలను బుధవారం తనిఖీ చేశారు. తొలుత రికార్డులను పరిశీలించారు. హస్పిటల్స్ లో జరుగుతున్న అభివృద్ధి పనుల పై సంబంధిత అధికారుల ను అడిగి తెలుసుకున్నారు. రూ.15 లక్షలతో పూర్తి చేసిన పనులను ఆమె పరిశీలించారు. రోగులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా తగిన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. రోగుల వద్ద కు వెళ్లి వైద్య సేవలు, గురించి అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిని కలియతిరిగారు. మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. ఖమ్మం ప్రభుత్వ మెడికల్కాలేజీలోని సీనియర్ రెసిడెంట్స్ వైద్యుల సేవలను వినియోగించుకోవాలని సూచించారు. స్థానిక ప్రభుత్వ హస్పిటల్ లో విద్యుత్ సమస్య ను తీర్చేందుకు ప్రత్యేక ట్రాన్స్ఫర్మర్ ను ఏర్పాటు చేయాలని విద్యుత్ అధికారులకు సూచించారు. చెరువుమాధారం హస్పిటల్ లో నిర్మిస్తున్న షెడ్ పనులను ఫిబ్రవరి రెండో వారం లోపు పూర్తి చేయాలని ఆదేశించారు. పనుల పట్ల నిర్లక్ష్యం చేయవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆసుపత్రుల సమన్వయ అధికారిడాక్టర్.కె.రాజశేఖర్ గౌడ్, తహశీల్దార్ వి.వెంకటేశ్వర్లు, పీఆర్ ఏఈ ప్రసాద్, వైద్యాధికారులు డాక్టర్ మంగళ, శ్రావణ్ కుమార్, సర్పంచ్ లు వెంకటలక్ష్మి, అమరగాని ఎల్లయ్య, ఉప సర్పంచ్ మద్దినేని మహేష్, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి జెర్రిపోతుల అంజిని, బచ్చలకూరి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

### ఫిర్యాదుల వెల్లువ..

పట్టణంలో వీధి కుక్కల వలన ప్రజలు ఇబ్బంది పడుతున్నారని వాటిని నివారించాలని మాలమహానాడు జిల్లా నాయకులు బట్టపోతుల ప్రకాషం ఫిర్యాదు చేశారు. ప్రభుత్వ స్థలాలను ఆక్రమించి దర్జా గా నిర్మాణాలు చేస్తున్నారని ఆఫ్ పార్టీ నాయకులు పసుమర్తి శ్రీనివాస్ ఫిర్యాదు చేశారు. రహదారుల ను ఆక్రమించి వ్యాపారులు ప్రత్యేక దుకాణాల ను ఏర్పాటు, చేసి అద్దెలు వసూలు చేస్తున్నారని స్థానికులు ఫిర్యాదు చేశారు.

## ఆక్రమణలో ఉన్న నా భూమిని నాకు ఇప్పించండి మహాప్రభో..!

**-ఏళ్లుగా తహసీల్దార్ కార్యాలయం చుట్టూ గిరిజన మహిళ ప్రదక్షణ**
**-కార్యాలయంలోకి రావద్దని మహిళపై తహసీల్దార్ ఆగ్రహం**



**ప్రజాపక్షం/తిరుమలాయపాలెం :** మా తల్లిదండ్రులు కాయ కష్టం చేసి పస్తులుండి చెమటోడ్చి కొనుగోలు చేసిన వ్యవసాయ భూమిని కొందరు వ్యక్తులు అక్రమంగా ఆక్రమించుకొని మాకు అన్యాయం చేశారని ఓ గిరిజన మహిళ ఆవేదన వ్యక్తం చేసింది. సంవత్సరాల తరబడి తాహసిల్దార్ కార్యాలయం చుట్టూ తిరిగిన ఏ ఒక్కరు పట్టించుకోలేదని ప్రస్తుతం ఉన్న తహాసిల్దార్ అవమానించినట్లు మాట్లాడుతూ, తహాసిల్దార్ కార్యాలయానికి రావద్దని హెచ్చరించాడని బాధితురాలు పేర్కొంది. బాధితురాలు మాలోత్ బికినీ తెలిపిన వివరాలు ప్రకారం మండల పరిధిలోని బాలాజీ నగర్ తండా గ్రామపంచాయతీ ఏదుల చెరువు రెవిన్యూ లో 113/ ఇ /ఆ, సర్వే నెంబర్లు సుమారు 5.8 కుంటల భూమిని మా తల్లిదండ్రులైన భూక్యా రూప్లి, లోకియా కష్టపడి కొనుగోలు చేసిన భూమిలో వ్యవసాయం చేసుకుంటూ మా తల్లిదండ్రులకు మేము ఐదు గురు ఆడ సంతానం కాగా ఆ భూమిలో వ్యవసాయం చేసి మమ్మల్ని పెద్ద చేసి పెళ్లిళ్లు జరిపించారు. ఈ క్రమంలో మా తల్లిదండ్రులు వృద్ధాప్యం రాగా మా అమ్మ రూప్లి ఆరోగ్య పరిస్థితి బాగోలేక వైద్య ఖర్చుల నిమిత్తం రెండు ఎకరాల భూమిని అదే తండాకు చెందిన భూక్య వెంకన్నకు విక్రయించాము ఇట్టి క్రమంలో మా తల్లి రూప్లి పేరు మీద ఉన్న మిగతా మూడు ఎకరాల 8 కుంటల భూమిని అదే గ్రామానికి చెందిన మూడు లింగయ్య, భూక్య కౌసల్య, భూక్య వెంకన్న, మూడు ఎకరాలు ఎనిమిది గంటల భూమిని తలా కొంత సాదా బైనామాలో అప్పటి రెవెన్యూ అధికారులకు థాయిలాలు ఇచ్చి భూమిని వారి పేరుపై ప ట్టా చేయించుకొని ఆక్రమించుకున్నారని ఆమె గత కొన్ని సంవత్సరాలుగా తాహసిల్దార్ కార్యాలయంలో ఫిర్యాదు చేస్తూ వస్తుంది. ఇన్ని సంవత్సరాలైనా రెవెన్యూ అధికారులు ఏమాత్రం పట్టించుకోలేదని ప్రస్తుతం ఉన్న తహాసిల్దార్ కనీస గిరిజన మహిళ అని చూడకుండా అవమానించినట్టు మాట్లాడుతూ, తహాసిల్దార్ కార్యాలయానికి రావద్దని హెచ్చరించాడని ఆమె తెలిపింది ఎన్నోసార్లు నా భూమి సర్వే చేయించాలని చలానా కట్టిన కనీసం తాహసిల్దార్ సర్వేరును పంపించట్లేదని ఆమె ఆవేదనను వెల్లబుచ్చింది ఇట్టి విషయంపై ఆమె న్యాయస్థానాన్ని ఆశ్రయించింది. రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఇలాకలో అసమర్ధ తహాసిల్దార్ ఉన్నందుకు ఆమె భూమికి న్యాయం జరగట్లేదని విలేకరులకు ముందు తమ ఆవేదనను వెల్లబుచ్చింది ఇప్పటికైనా సంబంధిత తహాసిల్దార్ అట్టి భూమిని సర్వే చేయించి ఆక్రమణలో ఉన్న భూమికి హద్దులు నియమించాలని కోరుతుంది.

## సిపిఐ ఆధ్వర్యంలో ప్రధాన రహదారిపై రాస్తారోకో



**ప్రజాపక్షం/జూలూరుపాడుః** జూలూరుపాడు మండలపరిధిలోని పాపకొల్లు రహదారి మూడు అడుగుల వెడల్పు పెంపు సరిపోదని ఏడు అడుగుల వెడల్పు పెంచితే ట్రాఫిక్ సమస్య లేకుండా ఉంటుందని, ఆర్అండ్‌బి అధికారులు తక్షణమే చర్యలు చేపట్టి రోడ్డు వెడల్పు పెంచాలని కోరుతూ సిపిఐ జూలూరుపాడు మండల సమితి ఆధ్వర్యంలో బుధవారం ప్రధాన రహదారిపై భారీ రాస్తారోకో నిర్వహించారు. అనంతరం సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు చంద్ర నరేంద్ర కుమార్ మాట్లాడుతూ నిత్యం వందలాది వాహనాలు మెయిన్ రోడ్డు కి వస్తున్నాయని రహదారి మూడు అడుగులు వెడల్పు ఉంటే తరచూ ట్రాఫిక్ సమస్య వల్ల ప్రజలు అనేక అవస్థలు పడుతున్నారని ప్రధానంగా ఎస్బిఐ, ఏపీజీవీబీ బ్యాంకులు ఇటు ఉండటంవల్ల వాహనదారులు అధిక సంఖ్యలో రావటం జరుగుతుందని, వాహనాలు బయట పార్కింగ్ చేస్తే తరచూ ట్రాఫిక్ సమస్య వల్ల ఆటో కార్మికులు, ఉద్యోగులు , విద్యార్థులు అవస్థలు పడుతున్నప్పటికీ, అండ్ బి అధికారులు తక్షణమే స్పందించి రోడ్డు వెడల్పు పెంచి ఇబ్బందులు లేకుండా చూడాలని , కోరారు ఆందోళన చేస్తున్న సీపీఐ నాయకులకు ఆర్ అండ్ బి అధికారులు స్పష్టమైన హామీ ఇచ్చారని, లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి గుండె పిన్ని వెంకటేశ్వర్లు, సహాయ కార్యదర్శి ఎస్కే నాగుల్ మీరా, యాలంకి మధు యాస రోశయ్య, ఏఐవైఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్కే చాంద్ పాషా, కొండా వీరయ్య, గార్ల పాటి వీరభద్రము, ఆటో వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ కార్యదర్శి నిమ్మటూరి లచ్చయ్య, గార్లపాటి శివ కృష్ణ, ఎస్కే బుడెన్ పాషా, మోదుగు దానేలు, గార్లపాటి కిరణ్ పటేలు కృష్ణ ఇల్లంగి సుందర్రావు కోటి వెంకటేశ్వర్లు రామకృష్ణ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# బ్యాటరీ దొంగలు అరెస్ట్

**-రూ. 2.16 లక్షల విలువైన బ్యాటరీలు స్వాధీనం**




**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** ట్రాక్టర్లు, జేసిబిలు, బస్సులకు ఉన్న బ్యాటరీలు చోరీ చేస్తున్న ఇరువురు వ్యక్తులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ. 2.16 లక్షల విలువ చేసే బ్యాటరీలను స్వాధీనం చేసుకున్నట్లు రఘునాథపాలెం ఇన్‌స్పెక్టర్ ఉస్మాన్ షరీఫ్ తెలిపారు. ఏసిపి రమణమూర్తి ఆదేశాల మేరకు సిఐ ఉస్మాన్ షరీఫ్ ఆధ్వర్యంలో ఎస్ఐ నరేష్ తన సిబ్బందితో రఘునాథపాలెం పోలీస్ స్టేషన్ ఎదుట జింకలతండా క్రాస్ రోడ్డు వద్ద బుధవారం వాహనాలను తనిఖీ చేస్తుండగా ఏపి28 బిఈ 6372 నెంబరు గల వ్యాగనార్ కారును తనిఖీ చేస్తుండగా కారు డ్రైవర్‌తో పాటు మరో వ్యక్తి తప్పించుకుని పారిపోయేందుకు ప్రయత్నించగా పోలీసులు వారిని వెంబడించి పట్టుకుని అదుపులోకి తీసుకున్నారు. వారిని విచారించగా పెనుబల్లి మండలం రామచంద్రాపురం గ్రామానికి చెందిన ఎస్‌కె అక్బర్ వృత్తి కారు డ్రైవర్, మరొకరు ఖమ్మం అర్బన్ మండలం బల్లేపల్లికి చెందిన షేక్ సైదులు వృత్తి కారు డ్రైవర్‌గా గుర్తించామన్నారు. వీరిరువురు వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలో బ్యాటరీల దొంగతనాలకు పాల్పడినట్లు విచారణలో తేలిందన్నారు. రఘునాథపాలెం మండలం గడ్డికుంట గ్రామంలో ఆపి ఉన్న బస్సు నుంచి ఒక బ్యాటరీ, ఖమ్మం కోర్టు ఆవరణలో ఉన్న జనరేటర్ నుంచి ఒక బ్యాటరీ, కూసుమంచి మండలం జీళ్లచెరువు దగ్గర వ్యవసాయ భూమి వద్ద ఒక బ్యాటరీ, తైవాన్ పంపు దొంగిలించారు. రఘునాథపాలెం యాపిల్ సెంటర్ వద్ద ఫ్లైయాష్ బ్రిక్స్ ఫ్యాక్టరీలో మూడు ట్రాక్టర్ల నుంచి మూడు బ్యాటరీలను, వి. వెంకటాయపాలెం గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఉన్న ఒక ట్రాక్టర్ నుంచి ఒక బ్యాటరీ, అదే గ్రామంలో మరో ట్రాక్టర్ నుంచి ఒక బ్యాటరీ, కామేపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో గోవింద్రాల గ్రామంలో పాఠశాలలో ఇన్వర్టర్ బ్యాటరీలు ఆరు, ఒక గ్యాస్‌బండ, డ్రాగన్ ఫ్రూట్ పొలంలో ఇనుప రాడ్లను, ఖానాపురం హవేలీ పోలీస్ స్టేషన్ పరిధిలో బాలపేట సమీపంలో జెవిడి వెంచర్‌లో మూడు టిప్పర్ల నుంచి ఆరు బ్యాటరీలను దొంగిలించినట్లు వారు అంగీకరించారని సిఐ ఉస్మాన్ షరీఫ్ తెలిపారు. దొంగిలించిన బ్యాటరీలను రఘునాథపాలెం పల్లె ప్రకృతి వనం చెట్ల పొదల్లో దాచి అట్టి బ్యాటరీలను ఖమ్మంలో విక్రయించేందుకు తీసుకెళ్తున్నట్లు గుర్తించామన్నారు. వారి వద్ద నుంచి రూ.2.16 లక్షల విలువ చేసే బ్యాటరీలు, గ్యాస్‌బండ, ఇనుప వస్తువులు, వ్యాగనార్ కారును స్వాధీనం చేసుకుని వారిని రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరుపర్చినట్లు సిఐ ఉస్మాన్ షరీఫ్ తెలిపారు.

## మణుగూరులో మొరాయిస్తున్న ఎయిర్‌టెల్ సేవలు

**-వినియోగదారుల గగ్గోలు...**
**-ప్రైవేట్ నెట్ వర్క్ తోను ఇబ్బందులు...?**
**-రీఛార్జ్ పేరిట అదనపు దోపిడీ**
**-వినియోగదారులను నడ్డి విఉస్తున్న ప్రైవేట్ సంస్థ**
**-అథర్ నెట్ వర్క్ లే నయమంటున్న వినియోగదారులు**

**ప్రజాపక్షం/మణుగూరుః** మణుగూరు పట్టణంలో ఎయిర్టెల్ నెట్ వర్క్ తరచూ మొరయిస్తుండడంపై వినియోగదారులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇంటర్నెట్ సేవలు కూడా అంతరాయం కలుగుతుందని వినియోగదారులు గగ్గోలు పెడుతున్నారు. ఇతర సిమ్ కార్డుల రీఛార్జ్‌లతో పోలిస్తే ఎయిర్టెల్ సంస్థ అదనంగా మూడు రూపాయలు ఛార్జ్ చేస్తోందని వారు ఆరోపిస్తున్నారు. ఈ విషయంపై పలువురు వినియోగదారులు మాట్లాడుతూ "ఇతర నెట్వర్క్‌లలో లేని అదనపు ఛార్జీలు ఎయిర్టెల్‌లో మాత్రమే వసూలు చేస్తున్నారు. ఇది వినియోగదారులపై అనవసర భారం" అని అన్నారు. మరో వినియోగదారు మాట్లాడుతూ "మేము రీఛార్జ్ చేయించుకునే సమయంలో చెప్పకుండా అదనంగా మూడు రూపాయలు తీసుకుంటున్నారు. పైగా నెట్వర్క్ కూడా సరిగా రావడం లేదు" అని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంకొకరు, "కాల్స్ తరచూ డ్రాప్ అవుతున్నాయి, ఇంటర్నెట్ స్పీడ్ చాలా నెమ్మదిగా ఉంది. ఈ పరిస్థితుల్లో అదనపు ఛార్జీలు అన్యాయం" అని పేర్కొన్నారు. ఈ సమస్యలపై ఎయిర్టెల్ యాజమాన్యం వెంటనే స్పందించి అదనపు ఛార్జీలను రద్దు చేయడంతో పాటు నెట్వర్క్ సమస్యలను పరిష్కరించాలని వినియోగదారులు కోరుతున్నారు.

## మిలటరీ సర్వీసు ఇంజనీరింగ్ అధికారుల పర్యటన

**- సామాజిక, ఆర్థిక పరిస్థితులపై ఆరా**



**ప్రజాపక్షం/పాల్వంచ :** మండల పరిధి మందెరికలపాడు గ్రామ పంచాయితీలో గత నాలుగు రోజులుగా మిలటరీ ఇంజనీరింగ్ సర్వీసు అధికారులు బస చేస్తున్నారు. ఈ సంధర్భంగా ఆ ప్రాంత అక్కడి భౌగోళిక పరిస్థితులు, ప్రజల సామాజిక, ఆర్థిక పరిస్థితులపై ఆరా తీస్తున్నారు. గిరిజనుల జీవన విధానాలు, స్థితిగతులపై వివరాలు తెలుసుకొంటున్నారు. కేంద్ర, రాష్ట్ర పథకాల అమలు, వినియోగంపై ప్రత్యక్షంగా లబ్దిదారులను అడిగి తెలుసుకొన్నారు. పర్యటనలో భాగంగా ఐదవ రోజు మందెరికలపాడు గ్రామ పంచాయితీలో స్వయం సహాయ సంఘాల మహిళలు, రైతులు, ప్రజలతో అటవీ, వ్యవసాయ, పశుసంవర్థక శాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. సమస్యలపై అడిగి తెలుసుకొన్నారు. ప్రభుత్వం అందజేస్తున్న వడ్డీలేని రుణాలతో పలు వ్యాపారాలు చేసుకొంటూ ఆర్థికంగా నిలదొక్కుకొంటున్నామని సంఘం సభ్యులు చెప్పారు. గ్రామాలకు దగ్గరలో కిన్నెరసాని ప్రాజెక్టు, రాళ్ళవాగు ఉన్నప్పటికి సాగునీరు లేకపోవటంతో వర్షాధారంపై ఆధారపడి ఒక పంటకే పరిమితం కావలసి వస్తుందని కావునా లిఫ్ట్ ఇరిగేషన్ సౌకర్యం కలిపించాలని కోరారు. దీనితో రెండు పంటలు పండిచటానికి అవకాశం ఉందన్నారు. సాగులో ముందకు సాగుతామని రైతులు అన్నారు. గిరిజనేతరులు మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాలుగా ఈ ప్రాంతంలో పోడు సాగు చేసుకొంటూ జీవిస్తున్నామని అన్నారు. మాకు అటవీ అధికారులు ఆర్ఓఎఫ్ఆర్ పట్టాలు మంజూరు చేయటం లేదని అధికారుల దృష్టికి తెచ్చారు. దీనితో ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్లు మాట్లాడుతూ ఈ ప్రాంతం వైల్డ్‌లైఫ్, రిజర్వ్ ఫారెస్ట్ కిందకు వస్తుందన్నారు. కావునా నిభంధనల మేరకు గిరిజనేతరులకు పట్టాలు మంజూరు చేయటం నిభంధనలకు విరుద్ధమని అన్నారు. 70 సంవత్సరాల క్రితం సాగుచేసుకొంటున్నట్లు ఏదైనా ఆధారాలు సమర్పిస్తే అధికారులు పరిశీలించి పట్టాలు మంజూరు చేసేందుకు కృషి చేస్తారని పేర్కొన్నారు. మిలటరీ అధికారులు సమస్యలపై మ్యాపు తయారు చేశారు. ఈ సమావేశంలో గ్రామ పంచాయితీ సర్పంచ్ బానోత్ లక్ష్మి, ఉప సర్పంచ్ కందుకూరి శ్రీను, మిలటరీ ఇంజనీరింగ్ సర్వీసు అధికారులు అనురాగ్ శ్రీవాత్సవ, ఎండి తస్కెనల్, మయాంకుచౌదరి, సునీల్, చందన్‌కుమార్, మండల వ్యవసాయాధికారి శంభో శంకర్, పశుసంవర్థక శాఖ వైద్యులు తేజ, ఏపిఎం మీరాభీ, టిసీలు పద్మ, రవికుమార్, ఫారెస్ట్ సెక్షన్ అధికారులు సునీత,అచ్చమ్మ, ఈరూలాల్, వెంకటేశ్వర్లు, గ్రామ పంచాయితీ కార్యదర్శి మోజేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## నేటి నుండి సీఎం కప్ క్రీడలు

**ప్రజాపక్షం/బూర్గంపాడు:** నేటి నుండి మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణ నందు సీఎం కప్ ఆటలను నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో జములారెడ్డి అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ సీఎం కప్ 202526 నిర్వహణలో భాగంగా మండల స్థాయిలో ఆటల పోటీలు నిర్వహించడం జరుగుతుందన్నారు.

## సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేత



**ప్రజాపక్షం/కారేపల్లి:** ఖమ్మం పార్లమెంట సభ్యులు రామసహాయం రఘురాంరెడ్డి సిఫారసు మేరకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి ప్రైవేట్ ఆసుపత్రల్లో చికిత్స పొందుతున్న వారికి చెక్కులు మంజూరు అయ్యాయి. పేరుపల్లి గ్రామానికి చెందిన ఎడ్ల సతీష్‌కు రూ 24,000, కారేపల్లి గ్రామానికి చెందిన తనకం నవీన్‌కు రూ 24,000లు మంజూరు అయ్యాయి. కాగా ఈ చెక్కులను కాంగ్రెస్ పార్టీ నాయకులు మల్లెల నాగేశ్వరరావు, బండారి మురళిలు లబ్దిదారులకు అందించారు. ఈసందర్భంగా లబ్దిదారులు ఎంపీకి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

## సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి



**ప్రజాపక్షం/ములకలపల్లి:** ఫిబ్రవరి 12న జరిగే దేశ వ్యాపిత సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు మండల కన్వీనర్ నిమ్మల మధు అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని పలు కార్మిక వాడల్లో యాజమాన్యాలకు, ప్రభుత్వ ఉద్యోగులకు సమ్మె నోటీసులు అందజేశారు. ఎంపిడివో కార్యాలయంలో సూపర్డెంట్ వి విజయరాజుకు సమ్మె నోటీసు అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్‌లు తీసుకొచ్చి కార్మిక వర్గానికి రక్షణగా ఉన్న 29 కార్మిక చట్టాలను తుంగలోకి తొక్కి కార్పొరేట్ సంస్థలకు అనుకులమైన నాలుగు లేబర్ కోడ్‌లను ప్రభుత్వం తీసుకొచ్చిందని, వాటిని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో గ్రామ పంచాయితీ వర్కర్స్ యూనియన్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ చిక్కుల శ్రీను, మండల కార్యదర్శి గంటా శ్రీనివాసరావు, వర్క రుక్మధరావు, వగ్గేల దారయ్య, ఆశా వర్కర్ యూనియన్ నాయకురాలు నున్నా లక్ష్మి , పుష్ప, నాగలక్ష్మి , కుమారి, తదితరులు పాల్గొన్నారు.

## ఎంపిడిఓగా బొగ్గా నారాయణ



**ప్రజాపక్షం/పాల్వంచ :** పాల్వంచ మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా విధులు నిర్వహిస్తున్న కుడముల విజయభాస్కర్ రెడ్డి డిఆర్‌డిఏ కార్యాలయంలో ఏపిడిగా బుదవారం బదిలీపై వెళ్ళారు. భద్రాచలంలో ఎంపిడిఓగా పనిచేస్తున్న బొగ్గా నారాయణ పాల్వంచకు వచ్చారు. దీనితో విజయభాస్కర్‌రెడ్డి నుండి బుదవారం బాద్యతలను స్వీకరించారు.

## పర్యావరణ పరిరక్షణపై అవగాహన



**ప్రజాపక్షం/పాల్వంచ :** పర్యావరణ పరిరక్షణ ప్రతీ ఒక్కరిపై ఉందని పాల్వంచ ప్రభుత్వ అటానమస్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ పి. పద్మ అన్నారు. రాబోయే తరాలకు హరిత భూమిని అందించేందుకు డిగ్రీ కళాశాల కెమిస్ట్రీ విభాగం ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణకు ముందగు వేసింది. బుదవారం కస్తూర్భా కళాశాలలో పర్యావరణ పరిరక్షణపై అవగాహనా సదస్సు నిర్వహించారు. అనంతరం ప్రినిపాల్ మాట్లాడుతూ అభివృద్ధికి విరుద్ధంగా ప్రకృతికి మనమే పెద్ద సవాలుగా మారుతున్నామని అన్నారు. పరిస్థితుల్లో మార్పు రావాలంటే ప్రతీ ఒక్కరు బాద్యతగా ప్రకృతి పరిరక్షణకు పాటు పడాలని పిలుపునిచ్చారు. పర్యావరణాన్ని మనం కాపడితే అది మనల్ని కాపాడుతుందన్నారు. కావునా ప్రకృతి రక్షణకు విరుద్దంగా తీవ్ర ప్రభావం చూపుతున్న వస్తువుల వినియోగం తగ్గించి మొక్కలను పెంచాలని సూచించారు. విద్యార్థులు చిన్నతనం నుండి పర్యావరణం పై అవగాహన కలిగి ఉండాలని, దాని రక్షణకు కృషి చేయాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో కస్తూర్భా కళాశాల ప్రిన్సిపాల్ తులసి, విజయప్రసాద్, నియాజ్ ఫర్వీన్, ఎన్. శ్రీదేవి, లీల, దీపిక, కరీమా, వకులా తేజస్విని, బాబ్జి, రమే, భాను, ప్రవీణ్, ఈ శ్రీను, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## మొదలైన నామినేషన్ల పర్వం

**ప్రజాపక్షం/ కొత్తగూడెం :** జిల్లాలోని మున్సిపల్ కార్పోరేషన్ ఎన్నికల హడావిడి మొదలైంది. ఇందులో భాగంగా తొలిరోజు కొత్తగూడెం కార్పోరేషన్ పరిధిలో మూడు నామినేషన్ల దాఖలు కాగా, ఇల్లెందు మున్సిపాలిటీలో 1, అశ్వారావుపేట మున్సిపాలిటీలో 3 నామినేషన్లు దాఖలయ్యాయి. కొత్తగూడెం కార్పోరేషన్ పరిధిలోని 19 డివిజన్‌లో ఇండిపెండెంట్ అభ్యర్ధి బోడ కృష్ణ, 56 డివిజన్లో బిఆర్‌ఎస్ అభ్యర్ధి బండారు రజిత, 8వ డివిజన్(పాల్వంచ)లో బిఆర్‌ఎస్ అభ్యర్ధి కాంపెల్లి సంధ్య నామినేషన్లు సమర్పించారు. అదే విధంగా ఇల్లెందు 6 వార్డులో బిజేపి అభ్యర్ధి నాయిని హైమావతి నామినేషన్ వేయగా, అశ్వారావుపేట మున్సిపాలిటీ పరిధిలో వార్డు 3లో బిఆర్‌ఎస్, బిజేపి అభ్యర్థులు, వార్డు 22లో బిజేపి అభ్యర్ధి వారి నామినేషన్లు సమర్పించారు.

# మురుగు నీటికి శాశ్వత పరిష్కారం

**-రూ. 1250 కోట్లతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీకి ప్రతిపాదనలు**
**-అభివృద్ధి పనుల శంకుస్థాపనలో మంత్రి తుమ్మల**





**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** మురుగు నీటికి శాశ్వత పరిష్కారం కోరకు ఖమ్మం నగరంలో రూ. 1250 కోట్లతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణానికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. బుధవారం ఖమ్మం నగరంలోని 21వ డివిజన్‌లో రూ. 5.45 కోట్లతో నిర్మించనున్న సిసి రోడ్లు, డ్రైన్ల నిర్మాణ పనులకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ ఖమ్మం నగరంలో మురుగు నీటికి శాశ్వత పరిష్కారం చూపేందుకు అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణానికి రూ. 1250 కోట్లతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించామన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహకారంతో కేంద్ర ప్రభుత్వ నిధులతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణం చేపడతామన్నారు. ఖమ్మం నగరంలో త్రాగునీటి సమస్య లేకుండా రూ. 250 కోట్లతో త్రాగునీటి పథకం పనులు చేపట్టినట్లు తెలిపారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా నగరంలో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపడుతున్నామన్నారు. ఖమ్మం నగరం క్లీన్ అండ్ గ్రీన్‌గా ఉండేందుకు నగర ప్రజలు సహకరించాలన్నారు. ప్రజలు కూడా తమ వంతు బాధ్యతగా ఖమ్మం నగరాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు కృషి చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో మేయర్ పునుకొల్లు నీరజ, ఖమ్మం మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య, ఖమ్మం ఆర్డీవో జి. నర్సింహారావు, మార్కెట్ కమిటీ ఛైర్మన్ యరగర్ల హన్మంతరావు, డిప్యూటీ మేయర్ ఫాతిమాజోహారా, కార్పొరేటర్ ఆళ్ల నిరీషా అంజిరెడ్డి, నగర అధ్యక్షులు నాగండ్ల దీపక్ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఆసుపత్రుల్లో మెరుగైన సేవలు అందించాలి

**-ప్రసవాల సంఖ్య పెంచాలి**
**-వైద్య ఆరోగ్యశాఖపై కలెక్టర్ సమీక్ష**



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ప్రభుత్వ ఆసుపత్రుల ద్వారా రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వైద్య ఆరోగ్య శాఖ వివిధ విభాగాల అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పిహెచ్‌సిలలో పనిచేసే ప్రతి సిబ్బంది అటెండెన్స్‌ను పర్యవేక్షించాలని, అనుమతి లేని సెలవులు, గైర్హాజరుపై చర్యలు తీసుకోవాలన్నారు. ఏఎన్సి రిజిస్ట్రేషన్ వంద శాతం జరగాలన్నారు. నాలుగు సార్లు పరీక్షలు జరిగి ఉండాలని తెలిపారు. ప్రతి వైద్యాధికారి తన పరిధిలోని ఆశా కార్యకర్తలతో రెగ్యులర్‌గా సమావేశాలు పెట్టుకోవాలని కలెక్టర్ సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాలు జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రైవేటు ఆసుపత్రుల్లో ఆపరేషన్లు ఎక్కువగా జరుగుతున్నాయని ప్రతి కేసును పరిశీలించి అవసరం లేని ఆపరేషన్లు నిరోధించాలన్నారు. గర్భిణీ మహిళలు వంద శాతం ఏఎన్సి రిజిస్ట్రేషన్ పూర్తయ్యేలా చూడాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల దగ్గర ఉన్న వసతులు ప్రైవేటు ఆసుపత్రుల్లో లేవని దీనిపై అవగాహన కల్పించాలని కలెక్టర్ తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో వీలైనంత వరకు సాధారణ ప్రసవాలు జరిగేలా చూడాలన్నారు. సి సెక్షన్ డెలివరీలను నివారించాలన్నారు. ప్రతి సెక్షన్ ఆపరేషన్ పై ఆడిట్ రిపోర్ట్ ఉండాలన్నారు. ప్రతి పిహెచ్‌సి పరిధిలో వంద శాతం పిల్లలకు టీకాలు వేయించాలని, వైద్యాధికారులు టీకాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ఎల్ఎంపి రిజిస్టర్స్ రాయాలని కలెక్టర్ తెలిపారు. ప్రతి పిహెచ్‌సి పరిధిలో ఎన్‌సిడి సర్వే పూర్తి చేసి వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. వైద్యాధికారులు తమ పరిధిలో ఆశా కార్యకర్తలతో చర్చించి సమస్యకు పరిష్కారం చూపాలన్నారు. ఎన్‌సిడి సర్వే విభాగంలో ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎం, ఎంఎల్‌హెచ్‌పి పాత్ర ఎంత ఉండాలో నిర్దేశించుకోవాలన్నారు. టిబి నిర్మూలనకు కృషి చేయాలని, అనుమానితులను గుర్తించి వైద్య పరీక్షలు నిర్వహించాలన్నారు. కంటి వెలుగు కార్యక్రమంలో ఆపరేషన్ల అవసరం గుర్తించిన వారికి ఆపరేషన్లు చేపట్టాలన్నారు. దత్తత నియమాల ప్రకారం పొందేలా చూడాలన్నారు. సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ రామారావు, అదనపు జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ చందునాయక్, డిప్యూటీ వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ వేణుమనోహర్, పివోలు, డాక్టర్ సుబ్బారావు, డాక్టర్ బిందుశ్రీ, డాక్టర్ ప్రవీణ, ప్రోగ్రాం అధికారులు, వైద్యాధికారులు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

# పెన్షన్ హక్కును కాపాడుకుందాం

**రిటైర్డ్ ఉద్యోగుల సంఘం సదస్సులో జిల్లా అధ్యక్షులు ఎం.సుబ్బయ్య**



**ప్రజాపక్షం/వైరా:** రిటైర్డ్ ఉద్యోగులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చే పెన్షన్ భిక్ష కాదని అది పెన్షనర్ల హక్కు అని రిటైర్డ్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.సుబ్బయ్య అన్నారు. వైరాలోని దత్తసాయి కళ్యాణ మండపంలో జరిగిన పెన్షనర్ల సదస్సు వైరా శాఖ అధ్యక్షులు చల్లా కృష్ణారావు అధ్యక్షతన జరిగిన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడుతూ రిటైర్డ్ ఉద్యోగులకు ఇస్తున్న పెన్షన్ భారాన్ని నిలిపివేయాలని చూస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా రిటైర్డ్ ఉద్యోగుల సంఘం ఆందోళన చేపడుతుందని తెలిపారు. పెన్షనర్ల విభజన కోసం ప్రభుత్వాలు చేస్తున్న ప్రయత్నాలు అడ్డుకుంటాయని తెలిపారు. రాష్ట్ర కార్యదర్శి పైడిపల్లి శరత్‌బాబు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పెన్షనర్లకు 2024 మార్చి నుండి ఇవ్వాల్సిన ప్రయోజనాలను విడుదల చేయకుండా కాలయాపన చేస్తూ పెన్షనర్లను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారని, కొందరు మరణించారని ఇప్పటికైనా ప్రభుత్వం ఆలోచించి రిటైర్డ్ ఉద్యోగుల ప్రయోజనాలను వెంటనే విడుదల చేయాలని తెలిపారు. జిల్లా ప్రధాన కార్యదర్శి తాళ్లూరు వేణు మాట్లాడుతూ రిటైర్డ్ ఉద్యోగులు 30 సంవత్సరాలు పైగా ప్రభుత్వానికి సేవ చేశారని, ఉద్యోగ సమయంలో దాచుకున్న ఆర్థిక సేవ చేశారని ఉద్యోగ సమయంలో దాచుకున్న ఆర్థిక ప్రయోజనాలను నిలిపివేయడం రాష్ట్ర ప్రభుత్వానికి తగదని, పెన్షనర్లకు ఇవ్వాల్సిన ఆరోగ్య కార్డులను అన్ని ప్రభుత్వ, కార్పొరేట్ ఆసుపత్రుల్లో అమలయ్యే విధంగా చూడాల్సిన ప్రభుత్వం చోద్యం చూస్తుందని అన్నారు. ఉద్యోగుల సహకారంతోనే ప్రస్తుత ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని, ప్రస్తుతం రాష్ట్రంలో పురపాలక సంఘాలకు ఎన్నికలు జరుగుతున్నాయన్నారు. ఈ సదస్సులో ఖమ్మం జిల్లా ఖజానా అధికారి వై.శ్రీనివాసరెడ్డి, జిల్లా గెజిటెడ్ అధికారుల సంఘం ప్రధాన కార్యదర్శి మోదుగు వేలాద్రి, రిటైర్డ్ ఉద్యోగుల సంఘం జిల్లా ఉపాధ్యక్షులు సాదినేని పూర్ణచంద్రరావు, వైరా ఎస్‌టివో డి.యల్లయ్య, టిఎన్‌జీవోస్ వైరా డివిజన్ అధ్యక్షులు ప్రవీణ్, మధిర మండల శాఖ అధ్యక్షులు అబ్రహం, వైరా ఎస్‌బిఐ టౌన్ బ్రాంచ్ మేనేజర్ బి.కోటేశ్వరరావు, వైరా మండల శాఖ ప్రధాన కార్యదర్శి మాచర్ల జయశంకర్, ఆర్థిక కార్యదర్శి సామినేని వెంకటేశ్వరరావు, గౌరవ అధ్యక్షులు పైడిపల్లి సత్యనారాయణ, గౌరవ సలహాదారులు టివి.కృష్ణయ్యసూరి, అసోసియేట్ అధ్యక్షులు షేక్ వలిజాన్, కె.సరస్వతి, ఎన్.వెంటయ్య, కార్యదర్శులు జి.సుబ్బయ్య, సిహెచ్‌ఎస్‌వి.ప్రసాద్, కె.శారదాదేవి, జిల్లా కౌన్సిలర్లు జివి.కృష్ణారావు, పొన్నం నర్సింహారావు, కొంగర నాగేశ్వరరావు, ఏ.సాయిబాబు, ఎస్.పిచ్చిరెడ్డి, వై.బోగేశ్వరరావు, పి.జాన్, చింతోజు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ పెన్షనర్లకు, పూర్వ మండల శాఖ బాధ్యులకు గౌరవ ఆత్మీయ అతిథులచే సన్మాన కార్యక్రమం నిర్వహించారు.

## సవరణ

ఐదు రోజుల పని దినాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం బ్యాంకు ఉద్యోగ సంఘాల ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించిన విషయం విధితమే. ప్రజాపక్షం దినపత్రికలో ఐదు రోజుల పని దినాలకు బదులుగా ఐదు గంటల పని దినాలు అని పొరపాటుగా ప్రచురించడమైంది. దీనిని ఐదు గంటలకు బదులు ఐదు రోజుల పనిదినాలుగా భావించగలరు.

## నిర్లక్ష్యానికి ఏడేళ్ల జైలు శిక్ష

**ప్రజాపక్షం/ ఖమ్మం లీగల్ :** నిర్లక్ష్యంగా వ్యవహరించి ఓ బాలుని మృతికి కారణమైన కేసులో ఇద్దరు వ్యక్తులకు ఏడేళ్ల జైలుశిక్ష విధిస్తూ ఖమ్మం అదనపు జిల్లా సెషన్స్ జడ్జి కె. ఉమాదేవి సంచలన తీర్పును బుధవారం వెల్లడించారు. వివరాల్లోకి వెళితే... కల్లూరు మండలం శాంతినగర్ కాలనీలో కంచపు పెద్ద సత్యం ఇంట్లో 2022 ఆగస్టు 22న వివాహం జరిగింది. ఈ సందర్భంగా విద్యుత్ స్తంభాల నుంచి విద్యుత్‌ను ఎటువంటి అనుమతి లేకుండా వినియోగించారు. నిర్లక్ష్యంగా విద్యుత్ వైర్లను అడ్డదిడ్డంగా ఏర్పాటు చేయడంతో ఆ విద్యుత్ తీగలు తగిలి కొత్తపల్లి రాణా హుస్సేన్ తీవ్రంగా గాయపడ్డాడు. గాయపడ్డ హుస్సేన్‌ను ఖమ్మం తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడని కల్లూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కల్లూరు పోలీసులు నిందితులపై కేసు నమోదు చేశారు. కేసును విచారించిన న్యాయాధికారి ఉమాదేవి కంచపు పెద్ద సత్యం, కంచపు లక్ష్మయ్యలకు ఏడేళ్ల జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు. ప్రాసిక్యూషన్ తరుపున పబ్లిక్ ప్రాసిక్యూటర్ జమ్ముల శరత్‌కుమార్ రెడ్డి వాదించగా కోర్టు లైజనింగ్ అధికారులు శ్రీకాంత్, హోంగార్డ్ ఆయూబ్‌లు సహకరించారు.

## బాధితులకు బాసటగా ఉండాలి




**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితులకు బాసటగా ఉండాలని, అడిషనల్ డీసీపీ లాండ్ ఆర్డర్ ప్రసాద్‌రావు పోలీసులకు సూచించారు. మంగళవారం ఖమ్మంరూరల్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా స్టేషన్ నిర్వహణ, పోలీసుల పనితీరు, విచారణనివేదికలు, సిసిటివిఎన్ అప్లోడ్, జనరల్ డైరీ రికార్డులు, సీజ్ చేసిన వాహనాలు, పరిశరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...బాధితుల ఫిర్యాదులను తీసుకొని, విచారణ చేసి న్యాయం చేయాలన్నారు. అలాగే స్టేషన్‌కు వచ్చే వారిపట్ల పోలీసులు మర్యాదపూర్వకంగా వ్యవహరించాలన్నారు. మున్సిపాలిటీ ఎన్నికల నేపథ్యంలో రౌడీషీటర్లు,హిస్టరీషీటర్లపై దృష్టి పెట్టాలన్నారు. ఎన్నికల నియమావళిపై ప్రజలకు క్షేత్రస్థాయి అవగాహన కల్పించాలన్నారు. విధిగా స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తూ వాహనాల తనిఖీలు ముమ్మరం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఖమ్మంరూరల్ ఏసీపీ తిరుపతిరెడ్డి, సిఐ రాజు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## వైరా ఏసిపిగా సారంగపాణి బాధ్యతల స్వీకరణ



**ప్రజాపక్షం/వైరా:** వైరా ఏసిపిగా ఎస్.సారంగపాణి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఖమ్మం పోలీస్ కమిషనర్ కార్యాలయంలో పోలీస్ కమిషనర్ కార్యాలయంలో పోలీస్ కమిషనర్ సునీల్‌దత్‌ని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. రాష్ట్రం లో పలువురు డీఎస్పీల బదిలీల్లో భాగంగా వైరా ఏసిపిగా ఎస్.సారంగపాణిని నియమిస్తూ ఇటీవల డిజిపి శివధర్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేసిన నేపథ్యంలో సారంగపాణి వైరా ఏసిపిగా బాధ్యతలు చేపట్టారు.

## నామినేషన్ దాఖలు చేసిన తిరుపతి శివకుమారి



**ప్రజాపక్షం/వైరా:** వైరా మున్సిపాలిటీ పరిధిలోని రెండో వార్డు లో బిఆర్ఎస్ పార్టీ నుంచి తిరుపతి శ్రీను సతీమణి తిరుపతి శివకుమారి బుధవారం వైరాలోని పశుగణాభివృద్ధి రైతు శిక్షణ కార్యాలయం నందు ఆ వార్డు నాయకులతో కలిసి నామినేషన్ దాఖలు చేశారు. ఈ కార్యక్రమంలో వేముల రవి, బత్తుల లింగారావు, వేముల శివ, భక్తుల వెంకటేష్, బండారు శ్రీనివాసరావు, తిరుపతి గోవిందు, తిరుపతి రవి, దేవళ్ళ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## తొలిరోజు రెండు నామినేషన్లు



**ప్రజాపక్షం/వైరా:** వైరా మున్సిపాలిటీలో మొదటి రోజు నామినేషన్ల ప్రక్రియలో భాగంగా మొత్తం రెండు నామినేషన్లు దాఖలు చేశారు. రెండో వార్డు నుంచి తిరుపతి శివకుమారి, 11వ వార్డు నుండి దొంతబోయిన వెంకటేశ్వర్లు, బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థులు నామినేషన్‌లు దాఖలు చేశారు.

## నూతన ఏసిపిని కలిసిన పోలీస్ అధికారులు



**ప్రజాపక్షం/వైరా:** వైరా ఏసిపిగా బాధ్యతలు స్వీకరించిన సారంగపాణిని బుధవారం వైరా సిఐ వెంకటప్రసాద్, ఎస్సై పుప్పాల రామారావు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. అదేవిధంగా తల్లాడ ఎస్సై వెంకటకృష్ణ, కొణిజర్ల ఎస్సై సూరజ్ ఏసిపిని కలిశారు.

# ఏజెన్సీ నుండి జాతీయస్థాయి హాకీ జట్టుకు..

- అండర్ - 17 జాతీయ జట్టుకు బప్పి భవిత
- జార్ఖండ్‌లో ఆడనున్న టిఎస్‌డబ్ల్యూఆర్‌ఐఎస్ విద్యార్థిని
- జిల్లా నుండి ఎంపికైన ఏకైక క్రీడాకారిణి



**ప్రజాపక్షం/భద్రాచలం :** పిట్ట కొంచెం కూత గనం అన్న చందంగా ఏజెన్సీకి చెందిన విద్యార్థినీ తడికల బప్పి భవిత ఉండర్ 17 జాతీయ హాకీ జట్టులో చోటు సాధించింది. చిన్న నాటి నుండి ఆటపాటల్లో అత్యంత చరుకుగా ఉండే భవిత క్రీడలతో పాటు సాంస్కృతిక రంగాల్లో ప్రతిభ కనబరిచేది. పాల్వంచలోని సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠ శాల్లో 8వ తరగతి చదువుతున్న భవిత రాష్ట్రస్థాయిలో వనపర్తిలో జరి గిన హాకీ క్రీడలో అత్యుత్తమ ప్రతిభ కనబరచడంతో ఆమెను ఉండర్ 17 జాతీయ జట్టుకు ఎంపిక చేశారు. ఆట ఆడుతున్న తీరు ఆకట్టుకోవ డంతో విద్యార్థినికి జాతీయ జట్టులో స్థానం దక్కింది. ప్రస్తుతం జార్ఖా డ్‌లోని రాంచిలో ఈనెల 29 నుండి 5 రోజుల పాటు జరుగుతున్న జాతీయ స్థాయి హాకీ క్రీడల్లో పాల్గొనేందుకు వెళ్లింది. ఇదిలా ఉండగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నుండి ఒకే ఒక విద్యార్థినీ ఎంపిక కావడం విశేషం. భద్రాచలం నియోజకవర్గం పరిధిలోని చర్ల మండలం లింగా పురం గ్రామానికి చెందిన తడికల అజయ్ కుమార్ కుమార్తె భవిత జాతీయ స్థాయి హాకీ ఉండర్ 17 జట్టుకు ఎంపిక కావడంతో పలు వురు అభినందలు తెలుపుతు న్నారు. విద్యార్థిని చదువుతున్న పాఠశాల ప్రధానోపాధ్యాయులతో పాటు ఉపాధ్యాయులు తోటి విద్యా ర్థులు సైతం అభినందించారు. జార్ఖాండ్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచి విజయ దరహాసంతో తిరిగి రావా లని, రాబోయే రోజుల్లో భారత జాతీయ హాకీ ప్రధాన జట్టుకు ఎంపికై ఏజెన్సీకి పేరు తెచ్చి దేశ ప్రతిష్టను ప్రపంచం ముందు నిలపాలని పలు వురు ఆకాంక్షిస్తున్నారు.

# వృత్తి నైపుణ్యతను పెంచడమే యాక్షన్ టెస్సా లక్ష్యం

-డిప్యూటీ జనరల్ మేనేజర్ డా॥ వై. జనార్థన్‌రెడ్డి



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** కార్పెంటర్లకు అధునాతన పరికరాల పరిజ్ఞానంతో వృత్తి నైపుణ్యతను పెంచేందుకు యాక్షన్ టెస్సా లక్ష్యం గా పని చేస్తుందని కంపెనీ డిప్యూటీ జనరల్ మేనేజర్ డా॥ వై. జనార్థన్ రెడ్డి తెలిపారు. బుధవారం ఖమ్మం నగరంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో యాక్షన్ టెస్సా ఆధ్వర్యంలో కార్పెంటర్లకు వృత్తి నైపుణ్యతపై సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన డిప్యూటీ జనరల్ మేనేజర్ డా॥ వై. జనార్థన్‌రెడ్డి మాట్లాడుతూ కార్పెంట ర్లు తమ వృత్తి పరంగా ఎన్నో ఏళ్ల నుంచి చేతి వృత్తులపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారన్నారు. అటువంటి కార్పెంటర్లకు అధునాతన పరికరాలు ఉపయోగించి వృత్తిలో ముందుకు సాగేందుకు అవసరమైన వృత్తి నైపుణ్యతను పెంచేందుకు యాక్షన్ టెస్సా కంపెనీ కృషి చేస్తుందన్నారు. ఇంజనీరింగ్ చెక్క పరిశ్రమకు కార్పెంటర్లు వెన్నుముక లాంటి వారన్నారు. అటువంటి కార్పెంటర్లు వారిలో ఉన్న నైపుణ్యాన్ని సృజనాత్మకతను పెంపొందించుకోవాలన్నారు. సదస్సు అనంతరం జిల్లా వ్యాప్తంగా హాజరైన కార్పెంటర్లను శాలువతో సత్కరించి మెమెం టోలను అందజేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ అజయ్ అగర్వాల్, యాక్షన్ టెస్సా ఉత్పత్తుల ఆథరైజ్డ్ డిస్ట్రిబ్యూటర్ తల్లపరెడ్డి శ్రీనివాసరెడ్డి, పలువురు కార్పెంటర్లు పాల్గొన్నారు.

# మన సంస్కృతీ సంప్రదాయాలు ఎంతో విశిష్టమైనవి..



**ప్రజాపక్షం/మణుగూరు:** మన దేశ సాంస్కృతి సంప్రదాయాలు ఎంతో విశిష్టమైనవి అని మణుగూరు ఏరియా సేవ అధ్యక్షురాలు దుర్గం సుమతి రామచందర్ అన్నారు. మణుగూరు ఏరియా బంగ్లోస్ ఏరియా ఇల్లందు క్లబ్ నందు లేడీస్ క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం బొమ్మల కొలువు కార్యక్రమం ఎంతో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల సందర్భంగా ఇల్లందు క్లబ్ ఆవరణ పచ్చని తోరణాలతో, ఆకర్షణీయ మైన రంగవల్లులతో, విద్యుత్ దీపాల అలంకరణతో పండుగ వాతావర ణాన్ని తలపింప చేసింది. ఈ కార్యక్రమానికి గౌరవ అతిథులుగా పాల్గొ న్న డైరెక్టర్ (ఆపరేషన్స్) ఎల్.వి.సూర్యనారాయణ సతీమణి మాలతి, డైరెక్టర్ కొప్పుల వెంకటేశ్వర్లు సతీమణి విజయలక్ష్మి, డైరెక్టర్ (ఈ అండ్ ఎం) తిరుమల రావు సతీమణి పద్మ, కొత్తగూడెం సేవ, మహిళా క్లబ్ అధ్యక్షురాలు మధురవాణి షాలెం రాజు , మహిళా క్లబ్ అధ్యక్షురా లు లక్ష్మి శ్రీనివాస్ , ఇల్లందు సేవ, మహిళ క్లబ్ అధ్యక్షురాలు వి. రమ కృష్ణయ్య ముందుగా దేవతా ప్రతిమలకు సంయుక్తంగా జ్యోతి ప్రజ్వ లన చేసి పూజ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఇల్లందు లేడీస్ క్లబ్ సెక్రెటరీ శ్రీదేవి రమేష్ బాబు, లేడీస్ క్లబ్ జాయింట్ సెక్రెటరీ హారతి నాగరమేష్, ఇల్లందు లేడీస్ క్లబ్ కమిటీ సభ్యులు లక్ష్మీ కిషన రామ్, సరిత శ్రీనివాస్, స్వాతి రామ్ శంకర్, ఇల్లందు లేడీస్ క్లబ్ సభ్యులు, మణుగూరు ఏరియా సింగరేణి అధికారుల సతీమణులు తది తరులు పాల్గొన్నారు.

# గ్రామ పంచాయతీ పనుల తీర్మానానికి కార్యదర్శి డబ్బులు డిమాండ్

ఎంపీడీవోకి ఫిర్యాదు చేసిన మాజీ ఎంపీటీసీ



**ప్రజాపక్షం/తిరుమలాయపాలెం :** పాలేరు నియోజకవర్గంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి గ్రామ పంచాయతీల అభివృద్ధే లక్ష్యంగా పట్టు విడని విక్రమార్కుల నిరంతరం కృషి చేస్తుంటే ఎర్రగడ్డ పంచా యతీ కార్యదర్శి మాధవి తీరుతో అది ఆచరణ సాధ్యం కావట్లేదని ఎర్ర గడ్డ గ్రామ మాజీ ఎంపీటీసీ చీమ లక్ష్మయ్య తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం మండల పరిధిలోని ఎర్రగడ్డ గ్రామపంచాయతీలో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని ఇటీవల మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ప్రజా ప్రతినిధులతో సమావేశం ఏర్పాటు చేయగా ఆ సమావేశంలో ఎర్రగడ్డ గ్రామానికి చెందిన కొందరు నాయకులు గ్రామ పంచాయతీలో అంతర్గత సిసి రోడ్లు అంగన్వాడి బిల్డింగ్ మరమ్మత్తులు పనుల నిమిత్తం కోరగా వెంటనే స్పందించిన మంత్రి శ్రీనివాస్ రెడ్డి సంబంధిత అధికారులకు ఆదేశాలిస్తూ నిధులు మంజూరు చేశారు. ఇట్టి పనుల్లో ఆ శాఖలకు సంబంధించిన అధికారులు వెంటనే పనులు చేప ట్టాలని ఆదేశాలు ఇవ్వగా ఎర్రగడ్డ గ్రామపంచాయతీలో విధులు నిర్వ హిస్తున్న పంచాయతీ కార్యదర్శి మాధవి తన స్వార్థ ప్రయోజనాల కోసం గ్రామాల్లో కొందరు అగ్రకులాలను వారిని ప్రోత్సహిస్తూ దళితుల పట్ల వివక్ష చూపుతూ ఈజీఎస్ ద్వారా గ్రామంలో సిసి రోడ్లు చేపట్టాల్సి ఉండగా గ్రామపంచాయతీ తీర్మానం ఇవ్వకపోవడంతో సుమారు పది లక్షల రూపాయల నిధులు వేరే గ్రామపంచాయతీకి మళ్లించినట్లు అధి కారులు తెలిపినట్లు ఆయన తెలిపారు. జనవరి 26న గ్రామ పంచాయ తీలో ఈజీఎస్ పనులపై గ్రామసభ ఉందని తెలియజేయగా గ్రామ సభకు వెళ్లిన గ్రామస్తులు ఈజీఎస్ లో జరిగిన పనులపై వివరాలు అడ గగా మీకు చెప్పవలసిన అవసరం లేదని మీ దిక్కున చోట చెప్పుకోమని కనీస మర్యాద లేకుండా ఆగ్ర వ్యక్తం చేస్తూ ఆమె దళితులపై వివక్ష చెబు తుందని వారు ఆరోపించారు. వెంటనే సంబంధిత కార్యదర్శి పై జిల్లా అధికారులు చర్యలు తీసుకొని ఆమె స్థానంలో కొత్త పంచాయతీ కార్య దర్శుని నియమించాలని ఎంపీడీవో కు ఆయన ఫిర్యాదు చేశారు.

# 50 కేజీల గంజాయి పట్టివేత



**ప్రజాపక్షం/భద్రాచలం :** ఒడిస్సా నుండి కేర ళాకు అక్రమంగా తరలించుకు పోతున్న సుమారు 50.04కేజీల గంజాయిని ఎక్సైజ్ ఎన్ఫో ర్సిమెంట్ అధికారులు పట్టుకున్నారు. పక్కా సమాచారం మేరకు భద్రాచలం పట్టణ శివారు లోని ఇసుర ర్యాంపు వద్ద కాపు గాసిన అధికా రులు అటుగా వేగంగా వస్తున్న వాహనాన్ని ఆపి సోదాలు చేయగా గంజాయి లభ్యమైంది. దీంతో నిందితులకు ఆరా తీసేందుకు ప్రయత్నించగా పొంతనలేని సమాధానాలు చెప్పడంతో అభయ్ సురేష్, మంజుమాన్, సురేంద్రమినాల్, అనంత కృష్ణ అనే నలుగురిని అదుపులోనికి తీసుకుని ఎక్సైజ్ స్టేషన్‌కు తరలించారు. పట్టుబద్ధగంజాయి విలువ సుమారు రూ.28లక్షల వరకు ఉంటుంది. వారు ఉపయోగించిన ఫియట్ కారుతో పాటు నాలుగు సెల్‌ఫోన్లు, రూ. 17వేల నగదును కూడా స్వాదీనం చేసుకుని కేసు నమోదు చేసి రిమాం డ్‌కు తరలించారు. ఎన్ఫోర్స్‌మెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ కె తిరుపతి ఆధ్వర్యంలో జరిగిన ఈ తనిఖీల్లో హెడ్ కానిస్టేబుల్ ఎంఏ కరీం, కానిస్టేబుల్ సుదీర్, వెంకట్, హనుమంతరావు, వీర బాబు, ఉపేందర్ తదితరులున్నారు.

# లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని సమ్మె నోటీస్



**ప్రజాపక్షం/కల్లూరు:** కార్మికులకు నష్టాన్ని కలిగించేలా కేంద్ర ప్రభుత్వం తెచ్చిన నాలుగు లేబర్ కోడులను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఫిబ్రవరి 12వ తేదీ దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెలో తెలంగాణ గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యం లో పంచాయతీ కార్మికులందరూ పాల్గొం టున్నట్లు తెలియజేస్తూఎంపీడీవో చంద్ర శేఖర్‌కు గ్రామ పంచాయతీ కార్మికులు బుధవారం సమ్మె నోటీస్ అందజేశారు. ఈ సందర్భంగా పంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి పిట్టల మల్లయ్య, నాయకులు దండు ఆదినా రాయణ, వేము రాంబాబులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ విధానాల వల్ల ప్రజలు, కార్మికులు ఎన్నో సమస్యలు ఎదుర్కొంటున్నారని సమ్మెను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కల్లూరు మండల దామాల దయాకర్ రావు, కల్లూరు మండల అధ్య క్షులు మాగంటి రాజశేఖర్, ఉపాధ్యక్షులు జాన్‌పాటి మల్లేష్, కార్యదర్శి బానోతు రమేష్ తదిత రులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# ప్రైవేటు ఆసుపత్రులను తనిఖీ చేసిన అధికారి



**ప్రజాపక్షం/కల్లూరు:** కల్లూరు పట్టణంలోని పలు ప్రైవేట్ ఆస్పత్రులను జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి బుధవారం రామారావు ఆకస్మిక తనిఖీ చేశారు. అన్ని ఆసుపత్రులను, ల్యాబ్ లను తనిఖీ చేసి ప్రభుత్వ అనుమతులను తప్పనిసరిగా ఉండాలని అర్హులైన వైద్యులు మాత్రమే వైద్యం చేయాలని లింగ నిర్ధారణ పరీక్షలు చేయరాదని, ధరల పట్టికలు అగ్నిమాపక శాఖ, బయో మెడికల్ మేనే జ్మెంట్ వారి ధ్రువీకరణ పత్రాలు తప్పనిసరిగా ఉండాలని, నిబంధనలను పాటించని ఆసుపత్రు లపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ప్రదీప్ వైద్యాధికారి, నవ్య కాంత్ ఉన్నారు

# ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

-పిఆర్‌టియు ఆధ్వర్యంలో డిఈవోకు వినతి



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** జిల్లాలో ఉన్న ఉపాధ్యాయుల సమస్యలను పరి ష్కరించాలని ఖమ్మం జిల్లా పిఆర్‌టియు అధ్యక్షులు కట్టా శేఖర్ తెలిపారు. బుధ వారం పిఆర్‌టియు ఆధ్వర్యంలో జిల్లా విద్యాశాఖాధికారిణి చైతన్యజైనిని కలిసి పిఆర్‌టియు క్యాలెండర్, డైరీని అందించి ఉపాధ్యాయుల సమస్యలపై వినతి పత్రం సమర్పించారు. సమస్యల పరిష్కారం పట్ల విద్యాశాఖాధికారి సానుకూలంగా స్పందించినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్ర మంలో జిల్లా ఉపాధ్యక్షులు గుడిపూడి శ్రీనివాసరావు, లింగం సతీష్, నగర అధ్యక్షలు పుసులూరి శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి శాంతారెడ్డి, ఖమ్మం అర్బన్ మండల అధ్యక్షులు బి. రవికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# సిసి రోడ్డుకు శంకుస్థాపన



**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** మండల పరిధిలోని కొర్లబోడు తండాలో సిసి రోడ్డు నిర్మాణ పనులకు శంకు స్థాపన చేశారు. బుధవారం గ్రామంలో రూ. 18 లక్షలతో మూడు అంతర్గత సిసి రోడ్డు పనులకు సర్పంచ్ భూక్యా చిన్నయ్య నాయక్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సహకా రంతో గ్రామాభివృద్ధికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. నాణ్యత ప్రమాణాలతో సిసి రోడ్లు నిర్మించా లని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ బానోత్ భీమ్లా, వార్డు సభ్యులు గుగులోత్ నరేష్, కాంగ్రెస్ గ్రామశాఖ అధ్యక్షులు భూక్యా వెంగల్, భూక్యా చందర్, భూక్యా కుమార్ తదితరులు పాల్గొన్నారు.